

www.epapersamayam.com APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

SAMAYAM

సంపుటి : 18 | సంచిక : 191 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 20 మార్చి 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

## 12 ఏళ్ల క్రితమే సునీతపై పాఠం..
## 9వ తరగతి హిందీలో ఓ అధ్యాయం

సమయం న్యూస్, హైదరాబాద్: భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ గురించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అప్పటి పాఠశాల విద్యాశాఖ పాఠ్య పుస్తకాల్లో ఒక పాఠంగా చేర్చి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేసింది. 2013లో తొమ్మిదో తరగతి హిందీ పాఠ్య పుస్తకంలో 11వ పాఠంగా చేర్చారు. భూకక్ష్యలో నిర్మించిన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టిన తొలి భారత సంతతి మహిళ సునీత. అంతరిక్షంలో అత్యధిక కాలం (195 రోజులు) గడిపిన, నడిచిన మహిళగా సునీత రికార్డు సృష్టించారని ఆ పాఠ్యపుస్తకంలో పేర్కొన్నారు. ఆమె తొలిసారి 2006 డిసెంబరు నుంచి 2007 జూన్

తరువాయి 2లో





## సాంకేతికతకు పెద్దపీట..
## ఆక్టోపస్ ఆధునికీకరణ

* బడ్జెట్‌లో హోంశాఖకు రూ.10,187 కోట్లు

సమయం న్యూస్, హైదరాబాద్: రాష్ట్ర హోంశాఖకు ప్రస్తుత బడ్జెట్‌లో రూ.10, 187.72 కోట్లు కేటాయించారు. ఇందులో నిర్వహణ పద్దు రూ.9,337.39 కోట్లు కాగా ప్రగతి పద్దు రూ.850.33 కోట్లు. గతేడాది

తరువాయి 2లో

## హైదరాబాద్‌లో మెక్ డొనాల్డ్స్ గ్లోబల్ ఇండియా కార్యాలయం

- 2 వేల ఉద్యోగావకాశాలు
- సీఎం సమక్షంలో సంస్థ ఒప్పందం

2లో



## ఐక్యంగా ముందుకు

- గేట్స్‌తో రాష్ట్ర సర్కారు జట్టు
- ఐదు రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయం
- చంద్రబాబు, బిల్ గేట్స్ సమక్షంలో ఒప్పందం
- ఈ ఎంవోయూ ఇతర రాష్ట్రాలకు నమూనా అని వెల్లడి

సమయం న్యూస్, ఢిల్లీ: వైద్యం, ఆరోగ్యం, మెడ్‌టెక్, విద్య, వ్యవసాయ రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లకు తక్కువ ఖర్చులో పరిష్కార మార్గాలు కనుక్కొని ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తేవడానికి కలిసి పనిచేయాలని ఏపీ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ నిర్ణయించాయి. బుధవారం మధ్యాహ్నం దిల్లీలో జరిగిన సమావేశంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ సమక్షంలో ఇరువర్గాలు పరస్పర అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని

తరువాయి 2లో





## ప్రగతి బాట..
## సంక్షేమ పూదోట..

- యువత సహా అన్ని వర్గాల మేలే లక్ష్యంగా కేటాయింపులు
- సంక్షేమానికి రికార్డు స్థాయిలో రూ.1.04 లక్షల కోట్లు
- గ్యారంటీ హామీలకు రూ.56 వేల కోట్లు
- అభివృద్ధి పనులకు రూ.36,504 కోట్లు
- ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, విద్యుత్ రాయితీలకు నిధుల పెంపు
- కొత్తగా రాజీవ్ యువ వికాసం, ఇందిరా గిరి జలవికాసం, సోలార్ గ్రామం, నగరాభివృద్ధి పథకాలు
- 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3.04 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్

సమయం న్యూస్, హైదరాబాద్: తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారి పూర్తి 12 నెలల ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టింది. గతేడాది ఫిబ్రవరిలో ఓటాన్ ఎకౌంట్, తర్వాత జులైలో మిగిలిన తొమ్మిది నెలలకు సంబంధించిన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే.

**మొత్తం వార్షిక పద్దులో 34.21%**

**సంక్షేమ పథకాలకే...**

ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క 202526 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ మొత్తం ఆదాయం రూ.3.04 లక్షల కోట్లలో అత్యధికంగా 34.21% అంటే రూ. 1,04,329 కోట్లను సంక్షేమ పథకాలకే కేటాయించింది. వీటిలోనూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారంటీ హామీల అమలుకు సంబంధించిన తొమ్మిది పథకాలకు ఏకంగా రూ.56,084 కోట్లు దక్కాయి. ప్రస్తుత ఏడాదికి ఇవే గ్యారంటీ హామీలకు రూ.47,167 కోట్లు కేటాయించగా వచ్చే ఏడాదికి మరో రూ.8,917 కోట్లు పెంచడం గమనార్హం. ఇక అభివృద్ధి ఫథకాలకు... ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనకు మూలధన వ్యయం కింద రూ.36,504 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర ఆదాయం మొత్తం రూ.3,04,466.55 కోట్లు ఉంటుందని, అయితే, రూ.498. 45 కోట్లు అధికంగా వ్యయం ఉంటుందని ప్రభుత్వం వివరించింది. రాష్ట్ర ఆర్థిక ద్రవ్యలోటు రూ.54,009.74 కోట్లు ఉంటుందని అంచనా వేసింది. అంటే అంచనా వేసిన వ్యయంకన్నా ఆదాయం రూ.54,009.74 కోట్లు తక్కువగా వస్తుంది. ఈ ఆర్థిక ద్రవ్యలోటును పూడ్చుకునేందుకు దాదాపు రూ.69,639 కోట్లను కొత్తగా రుణాలుగా సేకరించనుంది. వీటిని కలిపినా నికరలోటు రూ.498.45

తరువాయి 2లో

## వెల్‌కమ్ బ్యాక్ సునీతా..

- వ్యోమగామికి ప్రధాని మోదీ సందేశం

సమయం న్యూస్, ఢిల్లీ : భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ సురక్షితంగా భూమికి రావడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. భారత పుత్రిక సునీత, ఆమె సహచరులు ఎంతోమందికి ఆదర్శమని రాష్ట్రపతి కొనియాడారు. అంకితభావంతో ఉంటూ, ఏ కోశానా ఆశావాదాన్ని విడనాడకుండా వారు పనిచేశారని ప్రశంసించారు.

తరువాయి 2లో






## హెచ్1బీ వీసాలో మార్పులు..
## ఆ రికార్డులన్నీ తొలగింపు..!

సమయం న్యూస్, వాషింగ్టన్: అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటినుంచి వలసల అంశంపై ప్రత్యేక దృష్టిసారించారు అమెరికా (USA) అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఈ క్రమంలోనే తాజాగా వీసా జారీ ప్రక్రియ కోసం సరికొత్త వ్యవస్థను అమలుచేసేందుకు సిద్ధమయ్యారు. మార్చి 20 (అమెరికా కాలమానం ప్రకారం) నుంచి వీసా దరఖాస్తులను పరిశీలించే ఫారిన్ లేబర్ యాక్సెస్ గేట్‌వే వ్యవస్థలో పాత రికార్డులు, దరఖాస్తులను తొలగించనుంది.

తరువాయి 2లో

## పారిశ్రామికాభివృద్ధికి
## ఇదో మైలురాయి...

* 9 నెలల్లో రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు
* గత ఐదేళ్లలో ఉన్న సంస్థలనూ వెళ్లగొట్టారు
* అశోక్ లేలాండ్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్

సమయం న్యూస్, అమరావతి, హనుమాన్ జంక్షన్: రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి అశోక్ లేలాండ్ ప్లాంట్ మైలురాయిగా

తరువాయి 2లో



# సాంకేతికతకు పెద్దపీట.. ఆక్టోపస్ ఆధునికీకరణ

(మొదటిపేజీ తరువాయి)

హోం శాఖకు రూ.9,563 కేటాయించారు. ప్రస్తుత బడ్జెట్‌లో సాంకేతిక పరిజ్ఞానం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం వంటి వాటికి ప్రాధాన్యం ఇచ్చారు. వచ్చే ఏడాదికల్లా దేశంలో మావోయిస్టు సమస్యను పూర్తిగా రూపుమాపుతామని కేంద్రం పదేపదే చెబుతున్న నేపథ్యంలో మన గ్రేహౌండ్స్‌కు కూడా నిధులు పెంచారు. దాంతోపాటు పట్టణ ప్రాంతాల్లో ఉగ్రవాద చర్యలు అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ఆక్టోపస్ ఆధునికీకరణకూ ప్రాధాన్యం ఇచ్చారు.

**కీలకాంశాలకు కేటాయింపులివి**

* రాష్ట్ర స్థాయిలో పోలీసు సమాచార వ్యవస్థ మెరుగుపరచడానికి రూ.21.55 కోట్లు
* క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం కోసం గత బడ్జెట్‌లో రూ.220 కోట్లు కేటాయించగా ఈసారి రూ.242.25 కోట్లకు పెంచారు.
* కానిస్టేబుల్, ఎస్సైల శిక్షణ కారణంగా గత ఏడాది రూ.715.5 కోట్లు కేటాయించాల్సి వచ్చింది. శిక్షణ పూర్తవడంతో ఇప్పుడు కేవలం రూ.56.43 లక్షలతోనే సరిపెట్టారు.
* హైదరాబాద్‌లో పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి బడ్జెట్‌ను రూ.3.5 కోట్ల నుంచి రూ.6.5 కోట్లకు పెంచారు.
* గణేశ్ పండగ బందోబస్తు బడ్జెట్‌ను గతం కన్నా రూ.3.2 కోట్లు పెంచి రూ.15.50 కోట్లుగా చూపారు.
* గ్రేహౌండ్స్ బడ్జెట్ రూ.14 కోట్ల నుంచి రూ.34.91 కోట్లకు పెంచారు.
* ఆక్టోపస్ బడ్జెట్‌ను రూ.28 కోట్ల నుంచి రూ.42.56 కోట్లకు పెంచారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అత్యాధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం కొనుగోలు చేయనున్నారు.
* సైబర్ నేరాలు, మత్తుమందుల వినియోగం పెరుగుతుందని వీటిని నియంత్రించాలని చెబుతున్నప్పటికీ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, యాంటీ నార్కొటిక్స్ బ్యూరోలకు గతంలో మాదిరిగానే ఒక్కో విభాగానికి రూ.20 కోట్ల చొప్పున కేటాయించారు తప్ప పైసా పెంచలేదు.
* ట్రాఫిక్ వ్యవస్థ ఆధునికీకరణ బడ్జెట్‌ను రూ.కోటి నుంచి రూ.7.5 కోట్లకు పెంచారు.
* వరంగల్‌లో కొత్త కమిషనరేట్ భవనానికి, జిల్లా పోలీసు కార్యాలయాల నిర్మాణానికి రూ.100 కోట్లు, రూ.85 కోట్ల చొప్పున కేటాయించారు.
* అగ్నిమాపకశాఖలో భవనాల నిర్మాణం, యంత్రాల కొనుగోలు బడ్జెట్‌ను గతం కన్నా రూ.4 కోట్లు పెంచి రూ.12 కోట్లుగా చూపారు.

# ప్రగతి బాట.. సంక్షేమ పూదోట..

(మొదటిపేజీ తరువాయి)

కోట్లు ఉంటుందని వివరించింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత కరెంటు సరఫరా తదితర ప్రధాన పథకాలకు నిధులను పెంచింది. గతంలో రైతుభరోసాకు రూ.15 వేల కోట్లు ఇవ్వగా వచ్చే ఏడాది రూ.18 వేల కోట్లకు పెంచుతున్నట్లు తెలిపింది. ఇందిరమ్మ ఇళ్లకు రూ.12,571 కోట్లను కేటాయించింది. కొత్తగా రాజీవ్ యువ వికాసం, ఇందిరా గిరి జలవికాసం, సౌరవిద్యుత్ గ్రామం, నగరాభివృద్ధి పథకాలను వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించడానికి నిధులిచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు గరిష్ఠంగా రూ.4 లక్షల వరకు సాయం చేసేందుకు రాజీవ్ యువ వికాసం పథకానికి రూ.6వేల కోట్లను కేటాయించింది. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ పథకం కింద లబ్ధిదారులకు నిధుల మంజూరు పత్రాలను అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఎంపిక చేసిన గ్రామంలోని మొత్తం ఇళ్లకు, తాగునీటి బోర్లు, వీధిదీపాలతో సహా అన్నింటికీ సౌరవిద్యుత్‌ను అక్కడే ఉత్పత్తి చేసి వినియోగించేలా 'సౌర గ్రామం' పథకాన్ని అమలు చేయడానికి రూ.1,500 కోట్లు కేటాయించింది. ఇది కూడా రాష్ట్రంలో కొత్త పథకం అని ఇంధనశాఖ వర్గాలు తెలిపాయి. మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కొత్తగా 'నగరాభివృద్ధి' పథకాన్ని ప్రారంభించడానికి రూ.1000 కోట్లను బడ్జెట్‌లో తొలిసారి కేటాయించింది. సుదీర్ఘకాలం పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రాథమ్యాలు నిర్ణయించి రూ.23,373 కోట్లను కేటాయించింది.

**నిధుల సమీకరణ ఇలా...**

గతేడాది బడ్జెట్ రూ.2,91,059 కోట్లుగా తొలుత ప్రకటించినా చివరికి ఆదాయం తగ్గడంతో తాజాగా సవరించిన బడ్జెట్‌ను రూ.2,66,708.69 కోట్లుగా వెల్లడించింది. వచ్చే ఏడాది... ఇంతకన్నా మరో రూ.37,757.86 కోట్ల ఆదాయం పెరుగుతుందనే అంచనాతో మొత్తం బడ్జెట్‌ను రూ..3,04,466.55 కోట్లుగా చూపింది. ఇందులో పన్నుల ద్వారా రూ.1,45,419.58 కోట్లు, పన్నేతర ఆదాయం కింద రూ.31,618.77 కోట్లు, కేంద్రం నుంచి గ్రాంట్లుగా రూ.22,782.50 కోట్లు, కేంద్రం పన్నుల్లో రాష్ట్రం వాటా కింద రూ.29,899.77 కోట్లు వస్తాయంది. ఇవన్నీ నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరే ఆదాయ పద్దులు. ఇవికాకుండా.... కొత్తగా సేకరించే రుణాలు రూ.69,639 కోట్లను కూడా ఆదాయంలో కలిపి మొత్తం రూ.3.04 లక్షల కోట్లకుపైగా బడ్జెట్‌ను చూపింది. ఇందులో కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లపై రాష్ట్ర ప్రభుత్వం ధీమాగా ఉంది. గతంలో కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) అమలుకు రాష్ట్ర వాటా కింద చెల్లించాల్సిన 40% నిధులను సరిగా ఇవ్వనందున కేంద్రం గ్రాంట్లు సరిగా రాలేదని, ఈ ఏడాది నుంచి ఈ సమస్యను పరిష్కరించినందున వచ్చే ఏడాది గ్రాంట్లుగా రూ.22,782.50 కోట్లు వస్తాయని ప్రభుత్వం ధీమాగా ఉంది. రాష్ట్రం వాటా నిధులు సీఎస్ఎస్‌కు ఎప్పటికప్పుడు విడుదల చేయడంతో గ్రాంట్లు పెరుగుతున్నట్లు తెలిపింది.

పన్నుల ద్వారా రాబడి పెంపు

పన్నుల వసూళ్ల ద్వారా ప్రస్తుత ఏడాదిలో రూ.1,29,406.75 కోట్లు రాగా వచ్చే ఏడాది అంతకన్నా మరో రూ.16,012.83 కోట్లు పెరిగి మొత్తం రూ.1,45,419.58 కోట్లు వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. పన్నుల వసూళ్లలోలోపాలను సవరించడం ద్వారా ఆదాయం గణనీయంగా పెంచాలని సంబంధిత శాఖలను ఆదేశించింది. ఇసుక విక్రయాల విధానంలో ఉన్న లోపాలను సవరించడంతో నెల క్రితంతో పోలిస్తే ఇప్పుడు రోజుకు రూ.కోటిన్నర ఆదాయం పెరిగినట్లు ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. మద్యం అమ్మకాలపై వ్యాట్, ఎక్సైజ్ సుంకం వేర్వేరుగా వసూలు చేస్తున్నారు. ఎక్సైజ్ సుంకంగా ఈ ఏడాది రూ.20,298.89 కోట్లు వస్తాయని అంచనా వేస్తే ఏకంగా రూ.25,617.53 కోట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది రూ.27,623.36 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో అంచనా వేసింది. పెట్రోలు, మద్యం అమ్మకాలపై వసూలు చేసే వ్యాట్ కూడా గణనీయంగా పెరుగుతుందని భావిస్తోంది. శాఖలన్నింటిలో పన్నుల వసూళ్లలో లోపాలను సవరించడంతోపాటు, ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలతో మరో రూ.16,012.83 కోట్లు పన్నుల వసూళ్లు పెరుగుతాయని ప్రభుత్వం నమ్మకంగా ఉన్నట్లు సమాచారం.

*** రాబడి పెరుగుదల అంచనా 4.65 శాతమే**

ప్రస్తుత ఏడాదిలో రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధి రేటు 10.1% నమోదైనా... వచ్చే ఏడాది బడ్జెట్‌లో ఆదాయం పెరుగుదల 4.65% వరకు ఉంటుందని అంచనా వేసింది. వాస్తవిక దృక్పథంతోనే బడ్జెట్ ఆదాయ, వ్యయ అంచనాలు రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించినందునే ఈ మేరకు పరిమితమైనట్లు ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. గతంలో కనీసం 10% నుంచి 15% అధికంగా ఆదాయ వృద్ధిని చూపడం ఆనవాయితీగా వస్తోంది. అయితే జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాల నేపథ్యంలో వాస్తవిక దృక్పథంతో ఆదాయం పెంపును సవరించినట్లు సమాచారం. ఈ ఏడాది బడ్జెట్ ఆదాయం అంచనా రూ.2.90 లక్షల కోట్లు కాగా దానికన్నా మరో 4.65% అంటే రూ.13,551.84 కోట్లు పెరుగుతుందని ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో తెలిపింది. ఈ మేరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యమిచ్చింది.

*** భూముల అమ్మకాలు, మద్యం దుకాణాల వేలం**

బడ్జెట్‌లో చూపిన మరో కీలక పద్దు పన్నేతర ఆదాయం కింద చూపిన రూ.31,618.77 కోట్లు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చర్యల ద్వారానే ఈ ఆదాయం వస్తుంది. ప్రధానంగా భూముల అమ్మకాలపై రూ.20 వేల కోట్లకు పైగా రావచ్చని అంచనా వేస్తోంది. మద్యం దుకాణాలను ప్రతి రెండేళ్లకోసారి వేలం వేస్తారు. ఈ వేలం ప్రక్రియను వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిర్వహించాల్సి ఉందని, వీటిద్వారా రూ.3 వేల కోట్ల నుంచి రూ.4 వేల కోట్ల వరకు రావచ్చని అంచనా. ఇక స్థలాలు, భవనాల క్రమబద్ధీకరణ ద్వారా మరికొంత కలిపితే.... పన్నేతర ఆదాయం మొత్తం రూ.31,618.77 కోట్లు రావచ్చని అంచనా.

# పారిశ్రామికాభివృద్ధికి ఇదో మైలురాయి

(మొదటిపేజీ తరువాయి)

నిలుస్తుందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలను కలిగిన 75 ఎకరాల ఈ ప్లాంట్‌లో అధునాతన తయారీ, సాంకేతికతతో ఏటా 4,800 బస్సులను ఉత్పత్తి చేస్తారన్నారు. తొలి దశలో 600 మందికి ఉపాధి అవకాశాలు కల్పించారని, రెండో దశలో మరో 1,200 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలోని మల్లవల్లి పారిశ్రామికవాడలో అశోక్ లేలాండ్ బస్సుల తయారీ ప్లాంట్‌ను లోకేశ్ బుధవారం ప్రారంభించారు. అక్కడ తయారు చేసిన మహారాష్ట్ర స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ నూతన బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సభలో లోకేశ్ మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాకతో.. మళ్లీ ఏపీ బ్రాండ్ తిరిగొచ్చింది. ఇటీవల ఢిల్లీ వెళ్లినప్పుడు.. తమిళనాడుకు చెన్నై, కర్ణాటకకు బెంగళూరు, తెలంగాణకు హైదరాబాద్ ఉన్నాయి. ఏపీకి ఏముందని అడిగారు. ఏపీకి చంద్రబాబు ఉన్నారని నేను గర్వంగా చెప్పా. బాబు రాకతో పరిశ్రమలన్నీ ఒక్కొక్కటిగా తిరిగి వస్తున్నాయి' అని తెలిపారు.

పారిశ్రామిక పునరుజ్జీవనంతో సత్ఫలితాలు: "రాష్ట్రంలో కూటమి సర్కారు చేపడుతున్న పారిశ్రామిక పునరుజ్జీవన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. యువగళం పాదయాత్రలో భాగంగా 2023 ఆగస్టులో మల్లవల్లికి వచ్చినప్పుడు అశోక్ లేలాండ్ ఆగిపోయి కనిపించింది. తిరిగి ప్లాంట్‌ను తీసుకొస్తామని హామీ ఇచ్చా. అది నెరవేర్చినందుకు సంతోషంగా ఉంది. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. 9 నెలల్లోనే రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. వాటితో 4 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయి. తయారీ రంగంలో పెట్టుబడులకు గమ్యస్థానంగా ఏపీని మారుస్తున్నాం. పారిశ్రామికవర్గాల్లో నమ్మకాన్ని కలిగించేందుకు కృషి చేస్తున్నాం. అశోక్ లేలాండ్ లాంటి సంస్థలు రావడంతో రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి ఊపందుకోనుంది. కూటమి ప్రభుత్వ విజ్ఞప్తితో అశోక్ లేలాండ్ తక్కువ సమయంలో నూతన ప్లాంట్‌ను ప్రారంభోత్సవానికి సిద్ధం చేసింది" అని మంత్రి వెల్లడించారు.




"తెదేపా హయాంలో 1,360 ఎకరాల్లో ఏర్పాటు చేసిన మల్లవల్లి పారిశ్రామికవాడను వైకాపా పాలకులు దెబ్బతీశారు. మేం ఒప్పందాలు చేసుకున్న 450 కంపెనీల యాజమాన్యాలను వేధించి వెళ్లిపోయేలా చేశారు" అని లోకేశ్ పేర్కొన్నారు.

అశోక్ లేలాండ్ ఛైర్మన్ ధీరజ్ హిందూజా మాట్లాడుతూ..తమ సంస్థలకు ఏపీతో అనేక దశాబ్దాలుగా సంబంధం కొనసాగుతోందన్నారు. ఆ సంస్థ ఎండీ, సీఈఓ షేను అగర్వాల్ మాట్లాడుతూ.. దేశంలో బస్సులకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చటానికి ఈ ప్లాంట్ దోహదపడుతుందన్నారు. మొదటి రోజు నుంచే వంద శాతం సామర్థ్యంతో పని చేసేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, టీజీ భరత్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్ డీకే బాలాజీ, ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజు, ఎండీ అభిషిక్త్ కిషోర్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, హిందూజా గ్రూప్ ఛైర్మన్ అశోక్ హిందూజా తదితరులు పాల్గొన్నారు.

# 12 ఏళ్ల క్రితమే సునీతపై పాఠం.. 9వ తరగతి హిందీలో ఓ అధ్యాయం

(మొదటిపేజీ తరువాయి)

వరకు అంతరిక్షంలో గడిపారు. అంతరిక్షంలోకి అడుగు పెట్టడానికి మిమ్మల్ని ప్రేరేపించిన విషయం ఏమిటి అనే ప్రశ్నకు.. తనకు ఐదేళ్ల వయసు ఉన్నప్పుడు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడిపై నడవటాన్ని తాను చూశానని, ఆ దృశ్యం నుంచి ప్రేరణ పొందానని, అదే రోజు తాను కూడా వ్యోమగామి కావాలని నిర్ణయించుకున్నానని సమాధానమిచ్చినట్లు పాఠంలో పొందుపరిచారు. భావి భారత పౌరులకు మీరిచ్చే సందేశం ఏమిటి అన్న ప్రశ్నకు.. 'భారత్ ప్రతిభ ఉన్న దేశం. ఇక్కడ గ్రామాల్లోనూ ప్రతిభావంతులైన పిల్లలున్నారు. అమ్మాయిల్లో కూడా ప్రత్యేక ప్రతిభ ఉంటుంది. బాగా చదువుకున్న తర్వాత దేశం పేరును ఎప్పుడూ ఉన్నతంగా ఉంచుతూ ముందుకు సాగాలి' అని ఆమె సమాధానం ఇచ్చినట్లు పుస్తకంలో పొందుపరిచారు.

# హైదరాబాద్‌లో మెక్ డొనాల్డ్స్ గ్లోబల్ ఇండియా కార్యాలయం

హైదరాబాద్: అమెరికాకు చెందిన మల్టీ నేషనల్ సంస్థ మెక్ డొనాల్డ్స్ రాష్ట్ర ప్రభుత్వంతో కీలక ఒప్పందం చేసుకుంది. సంస్థ 'గ్లోబల్ ఇండియా ఆఫీస్'ను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. 2,000 మంది ఉద్యోగులతో కార్యాలయాన్ని త్వరలో ప్రారంభించనుంది. అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో బుధవారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో సంస్థ ఛైర్మన్, సీఈవో క్రిస్ కెంప్కెజెన్స్‌కీ, సంస్థ ప్రతినిధులు చర్చలు జరిపారు. గ్లోబల్ ఆఫీస్ ఏర్పాటుకు సంబంధించి సంస్థ రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పెట్టుబడుల ఒప్పందం చేసుకుంది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, సంస్థ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు స్కై అండర్సన్, చీఫ్ గ్లోబల్ ఇంపాక్ట్ ఆఫీసర్ జాన్ బ్యానర్, గ్లోబల్ ఇండియా హెడ్ దేశాంత కైలా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..'మెక్ డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ముందుకు రావడం హర్షణీయం. ఇందుకోసం పలు రాష్ట్రాలు పోటీపడుతున్న సందర్భంలో సంస్థ తెలంగాణ రాష్ట్రాన్ని ఎంచుకోవడం చాలా గర్వంగా ఉంది. ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తాం. గత 15 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య అభివృద్ధికి పలు కార్యక్రమాలను చేపట్టింది. సంస్థకు అవసరమైన శిక్షణను అందించడానికి, నిపుణులైన ఉద్యోగులను నియమించుకునేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సేవలు వినియోగించుకోవాలి. యూనివర్సిటీని 'స్కిల్స్ జోన్'గా ఉపయోగించుకొని, ఇక్కడ శిక్షణ పొందిన వారికి గ్లోబల్ ఆఫీసులోనే కాకుండా, దేశ విదేశాల్లో మీ ఆఫీసులు, అవుట్ లెట్లలో ఉద్యోగావకాశాలు కల్పించాలి. మెక్ డొనాల్డ్స్‌కు అవసరమైన మొత్తం వ్యవసాయ ఉత్పత్తులను స్థానిక రైతులు సమకూర్చేలా అవకాశం కల్పించాలి' అని పేర్కొన్నారు. మెక్ డొనాల్డ్స్ సీఈవో క్రిస్ కెంప్కెజెన్స్‌కీ మాట్లాడుతూ..బెంగళూరు లాంటి ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ప్రతిభావంతులైన నిపుణులతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన జీవన ప్రమాణాలున్నాయని, అందుకే హైదరాబాద్‌ను తమ గ్లోబల్ ఇండియా ఆఫీస్ సెంటర్‌గా ఎంచుకున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా మెక్ డొనాల్డ్స్ నిర్వహిస్తున్న కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, తెలంగాణలో భవిష్యత్ ప్రణాళికల గురించి ఆయన ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 38 మెక్‌డొనాల్డ్స్ అవుట్ లెట్లున్నాయి. ప్రతి ఏడాది మరో 3 లేదా 4 కొత్త అవుట్ లెట్లను విస్తరించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

# ఐక్యంగా ముందుకు

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగించుకొని ఈ ఐదు రంగాల్లోని సమస్యలకు పరిష్కారాలు కనుక్కొని, వాటిని వినియోగంలోకి తెస్తారు. ఈ ఒప్పందం ద్వారా గేట్స్ ఫౌండేషన్.. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను అమలుచేసే భాగస్వామ్య సంస్థలకు అవసరమైన సహకారం అందిస్తుంది. కృత్రిమ మేధను ఉపయోగించి రాష్ట్ర ప్రజల ఆరోగ్య సమస్యలను ముందుగానే విశ్లేషించి, అందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తుంది. ఏఐ, శాటిలైట్ ఆధారిత వ్యవస్థల ద్వారా పంటల సాగులో అనుసరించాల్సిన విధానాలు, వనరుల నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలపై ముందస్తుగా సలహాలు, సూచనలు అందిస్తుంది.

# వెల్‌కమ్ బ్యాక్ సునీతా..

(మొదటిపేజీ తరువాయి)

"వెల్‌కమ్ బ్యాక్ సునీత. మీ అపరిమిత ధైర్యం, స్ఫూర్తికి ఇన్నాళ్లూ పరీక్ష ఎదురైంది. మీ పట్టుదల ఏంటో అందరికీ చూపించారు. క్లిష్టమైన, అనిశ్చిత పరిస్థితుల్లో అచంచలమైన సంకల్పంతో ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారు" అని మోదీ కొనియాడారు. "అంతరిక్షంలో అన్వేషణ అంటే మానవ శక్తి పరిమితులను దాటి ముందుకెళ్లడం, కలలు కనే ధైర్యం కలిగి ఉండటం. ఈ విషయంలో సునీత తన కెరీర్ అంతటా గొప్ప స్ఫూర్తిని ప్రదర్శించారు. ఆమె ఓ ధ్రువతార, మార్గదర్శకురాలు. సునీతతో పాటు మిగిలిన వ్యోమగాములను సురక్షితంగా భూమిపైకి తీసుకువచ్చేందుకు అవిశ్రాంతంగా కృషి చేసిన వారిని చూసి గర్వపడుతున్నాం" అని ఆయన ప్రశంసించారు. తాను అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు సునీత కుటుంబంతో ముచ్చటించిన ఫొటోను పంచుకున్నారు.

**అద్భుత విజయం: ఇస్రో**

సునీత సురక్షితంగా తిరిగి రావడం ఒక అద్భుత విజయమని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ పేర్కొన్నారు. నాసా, స్పేస్ఎక్స్, అమెరికా నిబద్ధతలకు ఇది నిదర్శనమని ప్రశంసించారు. ఆమె దృఢ సంకల్పం ఔత్సాహికులకు నిత్యం స్ఫూర్తినిస్తుందన్నారు. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, జితేంద్రసింగ్ తదితరులు కూడా వారికి స్వాగతం చెప్పే సందేశాలు వెలువరించారు. వ్యోమగాములు సురక్షితంగా తిరిగి రావడం 140 కోట్ల మంది భారతీయులకు పెద్దఊరట అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

# హెచ్1బీ వీసాలో మార్పులు.. ఆ రికార్డులన్నీ తొలగింపు..!

(మొదటిపేజీ తరువాయి)

దీంతో హెచ్1బీ వీసా (H1B visa) ప్రోగ్రామ్‌లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. తాజా ఆదేశాల ప్రకారం.. మార్చి 20 నుంచి ఐదేళ్ల కంటే పాతవైన అన్ని రికార్డులను సిస్టమ్ నుంచి తొలగించనున్నారు. అంటే.. ఉదాహరణకు ఓ దరఖాస్తుకు సంబంధించిన 2020 మార్చి 22న తుది నిర్ణయం వెలువడి ఉంటే.. ఈ ఏడాది మార్చి 22న దాని రికార్డులను తొలగిస్తారు. ఉద్యోగులకు సంబంధించి ఐదు సంవత్సరాల కంటే పాతవైన వీసాల రికార్డులన్నింటినీ మార్చి 19లోగా డౌన్‌లోడ్ చేసి పెట్టుకోవాలని ఆయా సంస్థలను ఇప్పటికే ఆదేశించారు. లేదంటే ఆ రికార్డులను కోల్పోవాల్సి ఉంటుందని పేర్కొంది. హెచ్1బీ సహా అన్ని తాత్కాలిక లేబర్ కండిషన్ అప్లికేషన్స్, శాశ్వత లేబర్ సర్టిఫికేట్ అప్లికేషన్లపై ఈ తొలగింపు ప్రభావం పడనుందని ఆఫీస్ ఆఫ్ ఫారిన్ లేబర్ సర్టిఫికేషన్ విభాగం నోటీసులు జారీ చేసింది. త్వరలోనే వీసాల జారీ కోసం యూఎస్ ఇమిగ్రేషన్ విభాగం కొత్త దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించనుంది. దరఖాస్తుదారులందరికీ మరింత పారదర్శకంగా సేవలందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ సర్కారు వెల్లడించింది. అందుకే, పాత రికార్డులను తొలగిస్తున్నట్లు తెలిపింది.

# అన్ని వర్గాల సంక్షేమ బడ్జెట్ ఇది

**: ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి**



**సమయం న్యూస్ :** అన్ని వర్గాల సంక్షేమం తో పాటు రాష్ట్రం లో అభివృద్ధి కోసం తపిస్తూ క్రోడీకరించ బడిన బడ్జెట్ ను ప్రభుత్వం 2025 26 కోసం తయారుచేసి శాసన సభ , శాసన మండలి ముందుంచింది. విద్య, వైద్యం,వ్యవసాయ, పారిశ్రామిక రంగాలతో పాటు రైతులు, ఉద్యోగులు మహిళలు, బడుగు బలహీనవర్గాలు, విద్యార్థులు, కార్మికుల అభ్యున్నతి కోసం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తయారైన బడ్జెట్ ను మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబులు ప్రవేశపెట్టారు. గ్రామీణ ప్రాంతాలు మరియు పట్టణ ప్రాంతాలు ఇతో దికంగా అభివృద్ధి చెందేందుకు బడ్జెట్ ఫలాలు దోహదం చేస్తాయి. బడ్జెట్ పై కొందరి రన్నింగ్ కామెంట్రీ లు అటు ఉంచితే ఆర్థిక స్థితిగతులు సరిగా లేకున్నా తెలంగాణ సమాజం సర్వతో ముఖాభివృద్ధి కోసం బడ్జెట్ దూరం చేస్తుంది.




# త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలి

**: అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు**

హైదరాబాద్, మార్చి 19: గ్రేటర్ లో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హెచ్‌సిటీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం విదితమే. గ్రేటర్ లో హెచ్ సిటీ ద్వారా మొత్తం రూ. 7032 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనులు ప్రారంభించేందుకు కావాల్సిన భూసేకరణ పూర్తి చేసేందుకు బుధవారం అడిషనల్ కమీషనర్ శివ కుమార్ నాయుడు సికింద్రాబాద్ జోన్ లోని పలు ప్రాంతాల్లో పరిశీలించారు. సికింద్రాబాద్ జోన్ లోని పాటిగడ్డ ఆర్ ఓ బి, రసూల్ పుర ఫ్లైఓవర్, ఏ ఓ సి చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం, ఆర్.కే పురం, చిలకలగూడ ఆర్ యు బి పనులకు స్థల పరిశీలన చేసారు. ఈ సందర్భంగా అడిషనల్ కమీషనర్ మాట్లాడుతూ... త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఈ ఈ రోహిణి, టౌన్ ప్లానింగ్ అధికారులు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్రవర్ణ పేద యువతకు రాజీవ్ యువ వికాస్ పథకం వర్తింప చేయాలి

* **రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ భాస్కర్ రెడ్డి..**



**రాయపోల్. మార్చి సమయం న్యూస్ 19 :** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అగ్రవర్ణ కులాల్లోని పేద యువతకు కూడా వర్తింపచేయాలని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ ధన్యకూల భాస్కర్ రెడ్డి ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువత కోసం చేపట్టిన రాజీవ్ యువ వికాస్ పథకం లో భాగంగా 5 లక్షల మంది యువతకు రూ .16 వేల కోట్లతో చేపడుతున్నా ఈ రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అగ్రవర్ణ కులాల్లోని పేద యువతకు అవకాశం కల్పించకపోవడంతో తీవ్రంగా అన్యాయానికి గురవుతున్నారు. కులాలతో సంబంధం లేకుండా పేదరికమే లక్ష్యంగా ఏర్పాటు చేయాల్సిన యువ వికాస పథకాన్ని కులం పేరుతో అగ్రవర్ణ పేదలను పక్కకు పెట్టడం ఇది తీవ్ర నిరాశకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రవర్ణ కులాల్లో పుట్టిన ప్రతి ఒక్కరు ధనవంతులు కారని అందులో ఉన్న పేద యువతకు, నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేదంటే అగ్రవర్ణ పేద కులాల్లోని నిరుద్యోగ యువత నిరాశ, నిస్పృహలకు గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. గత పది రోజుల క్రితమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి అనే అగ్రవర్ణ పేద యువకుడు ఉద్యోగం కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు పిల్లలతో సహా భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే అని అన్నారు. ఈ సంఘటన ఒకటి చాలు అగ్రవర్ణ కులాల్లో కూడా పేద యువత, నిరుద్యోగులు ఉన్నారని తెలపడానికి నిదర్శనం అని అన్నారు. కావున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అగ్రవర్ణ పేదలను కూడా దృష్టిలో ఉంచుకొని ఆ నిరుద్యోగ యువతకు కూడా రాజీవ్ యువ వికాస్ పథకంలో వారిని కూడా భాగస్వామ్యులు చేస్తూ ఆ పథకాన్ని వర్తింపచేయాలని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే అగ్రవర్ణ కులాల్లోని నిరుద్యోగ యువతను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# ఈ బడ్జెట్లో తెలంగాణ ప్రజలకు దక్కేది గుండు సున్న: కేటీఆర్

* **ప్రతి రంగానికి ప్రతి వర్గానికి వెన్నుపోటు**
* **6 గ్యారంటీలతోపాటు ఎన్నికల హామీలకు మంగళం**
* **అన్ని వర్గాలను మోసం చేసిన బడ్జెట్**
* **ఇది 40% కమిషన్ల కాంగ్రెస్ బడ్జెట్**
* **ఇచ్చిన మాటకు కాకుండా ఢిల్లీకి మూటలు పంపడం పైననే దృష్టి**
* **ప్రజల కష్టాలు పైన ధ్యాస లేని బడ్జెట్- ప్రజాధనాన్ని పార్టీ పంచిపెట్టే కుట్ర**
* **ఆటో డ్రైవర్ నుంచి మొదలుకొని అన్నదాత దాకా అందరికీ మోసమే**
* **ఇది ట్రిలియన్ డాలర్ల అప్పు టార్గెట్ గా ఉన్న బడ్జెట్**
* **ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం**



రేవంత్ రెడ్డి అసమర్థతకు, చాత కానితనానికి, పరిపాలన వైఫల్యానికి నిలువుటద్దం ఈ బడ్జెట్ అన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. నమ్మి ఓటేసిన పాపానికి నాలుగు కోట్ల మందిని కాంగ్రెస్ నిలువునా ముంచిందని విమర్శించారు. పదేళ్ల ప్రగతి రథచక్రానికి పంచర్ చేసిన బడ్జెట్ ఇదని మండిపడ్డారు. ఇచ్చిన మాటకు కాకుండా ఢిల్లీకి మూటలు పంపడం పైననే బడ్జెట్ లో దృష్టి పెట్టారన్నారు. తెలంగాణ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమానికి పెను ముప్పులా ఉన్న 40% కమిషన్ కాంగ్రెస్ బడ్జెట్ ను బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని పేదలు, ఆడబిడ్డలు, రైతులు, రాష్ట్ర బడ్జెట్ పట్ల ఎంతో ఆశతో ఎదురు చూశారు. కానీ భట్టి విక్రమార్క గారి గంటన్నర సుదీర్ఘ ఉపన్యాసం తర్వాత ఆరు గ్యారంటీలు గోవిందా గోవిందా అని అర్థమైంది. నూరు రోజుల్లో ఆరు గ్యారెంటీ లు అనే మాటకు పాతర వేశారు. నెలకు 2500 రూపాయలు ఇస్తామని ఏ మహిళలకైతే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందో ఇప్పుడు ఆ మహిళలంతా ఈ బడ్జెట్ను చూసి షాక్ అయ్యారు. వంద రోజుల్లో 4000 రూపాయల పెన్షన్ వస్తుందని ఎదురుచూసిన వృద్ధులకు నిరాశ మిగిలింది. ఏ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందో ఆ హామీల గురించి బడ్జెట్లో కాంగ్రెస్ ప్రభుత్వం అసలు ప్రస్తావించ లేదు. 6 గ్యారంటీలు నూరు రోజులు అని సొల్లు పురాణం చెప్పి అఫిడవిట్లు రాసి దేవుని ముంగట పెట్టి ఆ అఫిడవిట్లే తమకు భగవద్గీత తో సమానమని అబద్ధాలు చెప్పి ఓట్లు వేయించుకొని గెలిచి ఇప్పుడు ఆ హామీలకు పాతర వేశారు. తుల బంగారం దిక్కులేదు. నెలకు 2500 రూపాయల మహాలక్ష్మి దిక్కులేదు. నెలకు 4000 రూపాయల పెన్షన్ ఊసే లేదు. కెసిఆర్ గారి ప్రభుత్వంలో నేతన్నకు పెద్దపీట వేస్తూ చేనేతకు పెట్టిన బడ్జెట్ 1200 కోట్ల రూపాయలు. కానీ ప్రస్తుత బడ్జెట్లో వారికి కేవలం 370 కోట్లు మాత్రమే కేటాయించారు. ఫ్రీ బస్సుతో ఓవైపు 100 మందికి పైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారు. కానీ వారికి హామీ ఇచ్చిన ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు గురించి ఈ బడ్జెట్లో అతీగతి లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది లక్షల మంది ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే వాళ్ల గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. స్విగ్గి, జొమాటో లాంటి గిగ్ వర్కర్ల కోసం ఒక బోర్డు పెడతామని రాహుల్ గాంధీ గారే స్వయంగా చెప్పారు వారి గురించి కూడా ఒక మాట లేదు. 73% ఫిట్మెంట్ లో కేసీఆర్ గారు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం చేస్తే వారికి ఇంకా ఎక్కువ న్యాయం చేస్తామని అధికారంలోకి వచ్చి వారి గురించి బడ్జెట్లో ఒక మాట కూడా చెప్పలేదు. పిఆర్సి గురించి కానీ పెండింగ్లో ఉన్న ఐదు డిఏ ల గురించి కానీ ఒక మాట కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తావించలేదు. కులగణన పేరుతో బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపించి కాంగ్రెస్ ప్రభుత్వం వారిని దారుణంగా మోసం చేసింది. యాదవ సోదరులకు ఇస్తానన్న గొర్ల గురించి ఈ ప్రభుత్వం బడ్జెట్లో పట్టించుకోలేదు. వైన్ షాపుల్లో 25% రిజర్వేషన్ ఇస్తానని గౌడ్ అన్నలకు ఇచ్చిన హామీని ఈ బడ్జెట్లో పట్టించుకోలేదు. అంబేద్కర్ అభయ హస్తం పేరుతో 12 లక్షలు దళితులకు ఇస్తామని గొప్పగా చెప్పుకొని దళితులకు వెన్నుపోటు పొడుస్తూ ఈ బడ్జెట్లో అంబేద్కర్ అభయ హస్తం గురించి మాట మాత్రం కూడా ప్రస్తావించలేదు. మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ గాంధీ అశోక్ నగర్ లో హామీ ఇచ్చారు. కానీ ఇవాళ నిరుద్యోగుల ఊసే ఎత్తడం లేదు. కెసిఆర్ గారి ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లు, చేసిన రిక్రూట్ మెంట్లకు అపాయింట్మెంట్ లెటర్లు ఈ ప్రభుత్వం ఇస్తూ తమ ఘనతగా చెప్పుకుంటుంటే నిరుద్యోగులు నవ్వుకుంటున్నారు. నిరుద్యోగ భృతి గురించి బడ్జెట్లో లేదు. 5 లక్షల విద్యా భరోసా కార్డు ప్రస్తావన లేదు. ఉన్న గురుకులాలనే నడపలేని అసమర్థులు 83 పైచిలుకు గురుకుల విద్యార్థులు చచ్చిపోతే ఏమి చేయలేని అసమర్థులు కొత్త స్కూళ్లు కడతామని బిల్డప్ ఇవ్వడం సిగ్గుచేటు. ఇవాళ హైదరాబాద్ మహానగరం అధ్వాన నగరంగా మారింది. మున్సిపల్ శాఖను నిర్వహిస్తున్న రేవంత్ రెడ్డి అసమర్థతతో పనులన్నీ పెండింగ్లో పడిపోయాయి. పేదలు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళితే కనీసం గోలీలు ఇచ్చే దిక్కులేదు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నాభిన్నం చేసింది. ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ చేస్తామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతలకు ట్రిలియన్లో ఎన్ని సున్నాలు ఉంటాయో కూడా తెలియదు. ట్రిలియన్ డాలర్లు అప్పు మాత్రం చేసేలాగా ఉన్నారు. కెసిఆర్ ప్రభుత్వం 10 ఏళ్లలో నాలుగు లక్షల 17 వేల కోట్ల రూపాయల అప్పు చేస్తే ఆరోజు కాంగ్రెస్ నేతలు కారు కూతలు కూశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే ఒక్క సంవత్సరంలో లక్ష 60 వేల కోట్లు చేసింది . ముఖ్యమంత్రి అసెంబ్లీలోనే ఒప్పుకున్నారు. 20% కమిషన్ పాలన దేశానికి సిగ్గుచేటు. 6 గ్యారంటీల అమలను పక్కనపెట్టి ఢిల్లీకి మూటలు పంపడానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది. మూసి లూటిఫికేషన్ మాత్రమే రేవంత్ ప్రథమ ప్రాధాన్యం. ఆ లూటిఫికేషన్ ద్వారానే ఢిల్లీకి మూటలు పంపుతున్నారు. ఏ ఒక్క ఊర్లోనైనా వందకు వందశాతం రుణమాఫీ జరిగిందని రుజువు చేస్తే మా శాసన సభ్యత్వాలను వదులు కుంటామని చేసిన చాలెంజ్ కు ప్రభుత్వం ఇప్పటిదాకా స్పందించలేదు. కోటిమంది రైతు కూలీలకు 12000 ఇస్తామని హామీ ఇచ్చి దాని గురించి ఈ ప్రభుత్వం పట్టించుకోలేదు. కానీ బడ్జెట్లో మాత్రం దాన్ని ప్రారంభించామని చెప్పుకుంటున్నారు. ఏ ఒక్క గ్రామం లోనైనా రైతు కూలీలు తమకు ₹12,000 వచ్చాయని చెప్తే ఏ శిక్ష కైనా సిద్ధం. నిన్నటిదాకా 20% కమిషన్ గా ఉన్న ప్రభుత్వాన్ని, 40 శాతం కమిషన్ ప్రభుత్వంగా మార్చి ఢిల్లీకి మూటలు పంపేందుకు ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది. రేవంత్ తెలివి తక్కువ తనం వల్ల ప్రభుత్వ అసమర్థ వల్లనే 73 వేల కోట్ల ఆదాయం పడిపోయింది. రేవంత్ రెడ్డి నెగిటివ్ పాలసీస్, నెగిటివ్ పాలిటిక్స్ వలన తెలంగాణ రాష్ట్ర ఆదాయం తగ్గింది. మీడియా ముందు రంకెలు వేసే రేవంత్ రెడ్డి అంకెలు ఎందుకు ఆగమయ్యాయో చెప్పాలి. తమ బడ్జెట్ వాస్తవాలకు దగ్గరగా ఉంది. నేల విడిచి సాము చేయలేదని ,గాల్లో మేడలు కట్టడం లేదని గత బడ్జెట్లో భట్టి గారు గొప్పగా చెప్పుకున్నారు. కానీ బడ్జెట్ ఎందుకు అంచనాలకు చేరుకోలేకపోయింది. 73 వేల కోట్ల ఆదాయం తగ్గిందని ముఖ్యమంత్రి ఎందుకు చెప్తున్నారో భట్టి విక్రమార్క గారు సమాధానం చెప్పాలి. నమ్మి ఓటేసిన పాపానికి నాలుగు కోట్ల మందిని ముంచిన బడ్జెట్ ఇది. పదేళ్ల ప్రగతి రథచక్రాన్ని పంచర్ చేసిన బడ్జెట్ ఇది. రేవంత్ రెడ్డి అసమర్థతకు చాతకానితనానికి, పరిపాలన వైఫల్యానికి నిలువుటద్దం ఈ బడ్జెట్. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గట్టిగా పడ్డ పునాది కాంగ్రెస్ ఒక సంవత్సరం పాలనలోనే బీటలు వారింది. ఆకాశం నుంచి పాతాళానికి ఆర్థిక వ్యవస్థ కూరుకుపోతున్నది. ఇందుకు కాంగ్రెస్ పార్టీని బాధ్యత తీసుకోవాలి. ఆనాడు మేము సంవత్సరానికి 40,000 కోట్లు అప్పు చేస్తే కాంగ్రెస్ నేతలు రంకెలు వేసి నోటికొచ్చిన మాటలు మాట్లాడారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం ఒక్క సంవత్సరంలోనే 1,60,000 కోట్ల అప్పుచేసి ఒక్క కొత్త ప్రాజెక్టు ఒక కొత్త పథకాన్ని కూడా ప్రారంభించలేదు. మళ్లీ లక్షల కోట్ల అప్పుకు ఈ బడ్జెట్లో టార్గెట్ పెట్టుకున్నారు. తొండ ముదిరితే ఊసరవెల్లి అవుతుందనేది పాత సామెత. ఊసరవెల్లి ముదిరితే రేవంత్ రెడ్డి అవుతుందనేది కొత్త సామెత. కాంగ్రెస్ ఉంది అంటేనే కరెంటు ఉండదు . కాంగ్రెస్ కరోనా వైరస్ కంటే ప్రమాదం. కాంగ్రెస్ పాలనలో సంక్షేమానికి సమాధి. అభివృద్ధి అడ్రస్ గల్లంతు. ప్రజలకు ఇచ్చిన హామీలకు గోరి కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రం 6000 కోట్ల రూపాయలను పప్పు బెల్లం లాగా పంచి పెట్టాలని అనుకుంటున్నారు. తెలంగాణ సొత్తును కాంగ్రెస్ కార్యకర్తలకు ఇస్తామంటే చూస్తూ ఊరుకోవడానికి ప్రజలు సిద్ధంగా లేరు. కాంగ్రెస్ కార్యకర్తలకు 6000 కోట్లు ఇవ్వడం యువ వికాసం కాదు తెలంగాణ వినాశనం. ఇప్పటికైనా ఢిల్లీకి మూటలు పంపే అలవాట్లు మానుకొని రైతుల ఆత్మహత్యల మీద దృష్టి పెట్టాలి. రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే సిగ్గు లేకుండా ఈ ప్రభుత్వం అందాల పోటీలు పెడుతుంది. ఆ విషయాన్ని కూడా బడ్జెట్లో చెప్పుకోవడం సిగ్గుచేటు. ప్రజా వ్యతిరేకమైన బడ్జెట్ ను మేము వ్యతిరేకిస్తున్నాం.

# స్వయం ఉపాధి పథకాలకు సబ్సిడీ తో కూడిన రుణాలను సద్వినియోగం చేసుకోండి

**: ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ**

బి.సి., కాపు, ఈ.బి.సి. మరియు బ్రాహ్మణ, క్షత్రియ,కమ్మ, రెడ్డి వైశ్యలకు రుణాలు ఇచ్చేందుకు వెబ్ సైట్ ఓపెన్ అయ్యింది. తగిన పత్రాలతో https://apobmms.apcfss.in/ ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి. బి.సి.కార్పోరేషన్, ఇబిసి, కమ్మ, రెడ్డి,ఆర్య వైశ్య, క్షత్రియ మరియు బ్రాహ్మణ కార్పోరేషన్లకు సంబంధించిన లబ్ధిదారులకు బిసి కార్పోరేషన్ ద్వారా వివిధ పథకముల ద్వారా సబ్సిడీ మంజూరు చేయుటకు గాను, దరఖాస్తుదారులు APOB MMS ద్వారా వారి పేరును ఆన్లైన్ లోనమోదు చేసుకోవాలి. ఇందుకు 10.03.25 నుండి 2203-2025 వరకు అవకాశం కల్పించబడినది.



ఇందుకు బిసిలందరూ దరఖాస్తు చేసుకొనవచ్చును.అలాగే ఇబిసి కుల ధృవ పత్రం కలిగిన ఓసి కమ్యూనిటీ వారు, కమ్మ కుల ధృవ పత్రం కలిగిన ఓసి కమ్యూనిటీ వారు, రెడ్డి కుల ధృవ పత్రం కలిగిన ఓసి కమ్యూనిటీ వారు, ఆర్య వైశ్య కుల ధృవపత్రం కలిగిన ఓసి కమ్యూనిటీ వారు, క్షత్రియ కుల ధృవ పత్రం కలిగిన ఓసి కమ్యూనిటీ వారు, బ్రాహ్మణ కుల ధృవ పత్రం కలిగిన ఓసి కమ్యూనిటీ వారు కూడా అప్లై చేయవచ్చు. అన్ని వనరులు కలుపుకుని గ్రామీణ ప్రాంతము వారి ఆదాయము రూ.81,000/ లేదా అంతకంటే తక్కువగా ఉండవలెను. 21 నుండి 60 సం.ల మధ్య వయసు గలవారు అర్హులు. తెల్ల రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రం మరియు ఆదార్ కార్డు తప్పనిసరిగా కలిగి యుండవలెను. ఒక కుటుంబము యొక్క తెల్ల రేషన్ కార్డు నందు ఒక్కరు మాత్రమే లబ్ది పొందుటకు అర్హులు. వ్యవసాయ సంబంధ కార్యక్రమాలు, పరిశ్రమలు, చిన్న తరహా వ్యాపారము, సేవలు, రవాణా విభాగము వంటి సెక్టార్లకు సంబందించిన యూనిట్లకు సబ్సిడీ మంజూరు చేయబడును. పైన తెలిపిన విధంగా అర్హతలు కలిగిన వారు htpps://apobmms.dev.nidhi.apcfss.in/ వెబ్సైటు (ఆన్లైన్ ) నందు తేదీ 10032025 నుండి 2203-2025 వరకు వారి వారి పేర్లను APOBMSS వెబ్సైటు నందు నమోదు చేసుకోవాలి.

# ఎంపీ నిధులతో సిసి రోడ్ల నిర్మాణం..

* **మండల బిజెపి అధ్యక్షుడు మంకిడి స్వామి..**



**రాయపోల్ మార్చి 19, సమయం న్యూస్ 19 :** మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఆదేశాల మేరకు రాయపోల్ మండలంలోని పెద్దఆరేపల్లి,వడ్డేపల్లి,కొత్తపల్లి గ్రామాల్లో ఒక్కొక్క గ్రామానికి రూ. 10 లక్షల సిసి రోడ్డు పనులను ఉపాధి హామీ పథకం ద్వారా సిసి రోడ్డు పనులను బుధవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం జరిగిందని మండల బీజేపీ అధ్యక్షులు మంకిడి స్వామి అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాయపోల్ మండలంలోని ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు గారి సహకారంతో 60 లక్షల సిసి రోడ్ పనులను ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా రఘునందన్ రావు గారికి గ్రామ ప్రజల తరపున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాజా మాజీ మండల అధ్యక్షులు వెంకట్ గౌడ్ రాజా గౌడ్ కృష్ణ స్వామి రాజు తదితరులు పాల్గొన్నారు

## సంపాదకీయం

# ప్రజల్లో... తగ్గుతున్న కొనుగోలు శక్తి

పెరుగుతున్న ఆర్థిక మాంద్యం, ధరల పెరుగుదలకు తోడు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో నిరుద్యోగం తాండవిస్తోంది. దీనికితోడు ప్రల కొఉగోలు శక్తి పూర్తిగా సన్నగిల్లుతోంది. గ దశాబ్దంలో పేదలు బరీ పేదలుగా మారారు. పెద్దలు మరింత పెద్దపెద్ద భవంతులకు చేరుతున్నారు. వారికి డబ్బులు సమకూరుతోంది. ముఖ్యంగా దిగువ మధ్యతరగతి ప్రజలు మరింత పేదలుగా మారుతున్నారు. నిత్యాసవసర వస్తువులను కొనుగోలు చేసే శక్తి సన్నగిల్లుతోంది. ఇదంతా కూడా ఆర్థిక సంక్షోభానికి పరాకాష్టగా చూడాలి. కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర భారత్,ఆ తరువాత వికసిత్ భారత్ అని చెబుతూ, ఆర్థికంగా భారత్ బలోపేతంగా మారిందని నమ్మబలుకుతున్నారు. గ్రామాల్లో పేదల స్థితిగతులు మరితం దుర్భరంగా మారయి, మధ్యతరగతి ప్రజలు తిండికి, వైద్యానికి కూడా నోచుకోవడం లేదు. ఆస్పత్రుల బిల్లులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. ప్రభుత్వం వూద్యం అందడం లేదు. కరోనా అనంతరం మళ్లీ ఆదాయాలు పుంజుకొని అభివృద్ధి ఉరకలు వేస్తుందన్న గారడీ మాటలను ప్రజలు నమ్మడం లేదు. గతంలో క్షీణించిన వృద్ధి రేటు తిరిగి పెరుగుతూ పోతుందన్నారు. బిజెపి పాలనలో భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టదిశగా పరిణామం చెందుతోందన్నారు. అంటే కొద్దిమంది సంపన్నుల సంపద పెరుగుతోందనీ అత్యధికులుగా వున్న మధ్యతరగతి, పేదలు ఇంకా కునారిల్లుతున్నారని గుర్తించడం లేదు.ప్రపంచంలో పేదరికం తగ్గింపు కోసం అనేక దేశాల్లో ఆయా ప్రభుత్వాలు ఆర్థిక విధానాలను రూపొందిస్తున్నాయి. అయితే ముఖ్యంగా సోషలిస్టు దేశాలు ఆదాయ అంతరాల తగ్గింపు కోసం కృషి చేస్తున్నాయి. అందులో భాగంగా సంపద పోగు పడుతున్న వారి నుండి అధిక పన్నులు వసూలు చేయడం, మధ్య, అల్పాదాయ వర్గాల వారికి ప్రభుత్వ తోడ్పాటు పెంచడం వంటి విధానాలు అనుసరిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వరంగ పాత్రను పెంచుతున్నాయి. ఇంకొన్ని దేశాల్లో ఆదాయంలో పన్ను చెల్లింపు వాటాను కొలబద్ధగా తీసుకొని, అధికాదాయ వర్గాలవారి నుండి ఎక్కువగా వసూలు చేస్తున్నారు. అంతరాల తగ్గింపు లక్ష్యంగా వివిధ చర్యలు చేపడుతున్నారు. అందుకు భిన్నంగా నరేంద్ర మోడీ పాలనలో సంపన్నులపై విధించే కార్పొరేట్ పన్ను తగ్గించారు. వారు బ్యాంకులకు చెల్లించవలసిన లక్షల కోట్ల రూపాయల రుణాన్ని మాఫీ చేశారు. ప్రోత్సాహకాల పేరిట కేంద్ర బడ్జెట్‌లో ఏటా లక్షల కోట్ల రూపాయలు కుమ్మరిస్తున్నారు. మరోవైపున మధ్యతరగతి వారిపై విధించిన ఆదాయ పన్ను ఖజానాకు ఏడాదికేడాది ఎక్కువగా పోగుపడుతోంది. ఇక పేదలను ఎంతలా దిగజార్చుతున్నదీ అందరికీ తెలిసిన విషయమే! ప్రభుత్వ విధానాలే ఆదాయ అంతరాల పెరుగుదలకు కారణం కనుక వాటిని మార్చాల్సిందే. అందుకు బలమైన ప్రజా ఉద్యమాలు కావాలి. తాజా ఆదాయ అంతరాల నివేదిక ఈ విశ్లేషణ ఎంత సత్యమో విదితపరుస్తోంది. దేశంలోని సంపన్నులు జాతీయాదాయంలో తమ వాటాను గణనీయంగా పెంచుకుంటుంటే గ్రామీణ, అల్పాదాయ వర్గాల ప్రజలు అత్యవసర సేవలు, విద్య, ఆరోగ్య రక్షణ, ఆర్థికావసరాలు పరిమితంగానే పొందగలుగుతున్నారని ఆర్థిక సర్వేలు హెచ్చరిస్తున్నాయి. వరల్డ్ ఇనీక్వాలిటీ డాటాబేస్ (విడ్) ప్రకారం 2023లో దేశంలో అత్యంత సంపన్నులైన ఒక శాతం ప్రజలు 22.6 శాతం జాతీయాదాయంపై ఆధిపత్యాన్ని చెలాయించారని పేర్కొంది. దేశంలో ఓ మోస్తరు సంపాదన కలిగిన 40 శాతం జనాభా వాటా జాతీయాదా యంలో 43.9 నుండి 46.6 శాతం వరకూ ఉన్నదని కుటుంబ సర్వేలు తెలిపాయి. అయితే విడ్ అంచనాల ప్రకారం జాతీయాదాయంలో మధ్య తరగతి ప్రజల వాటా గణనీయంగా పడిపోయింది. ప్రస్తుతం దేశంలో ఆదాయ అంతరాలు 1950వ దశకంలోకంటే అధికంగా ఉన్నాయని పీపుల్ రిసెర్చ్ ఆన్ ఇండియాస్ కన్స్యూమర్ ఎకానమీ (ప్రైస్) సంస్థ ఇటీవల విడుదల చేసిన పత్రంలోని సమాచారం ఆందోళన కలిగిస్తోంది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్ రిసెర్చ్, ప్రైస్ తదితర సంస్థలు నిర్వహించిన కుటుంబ ఆదాయ సర్వేల ఆధారంగా ఈ పత్రాన్ని రూపొందించారు. అంటే ఆదాయ అంతరం అంతకంతకూ పెరిగిపోతోందన్నమాట. ప్రజలు ఆదాయం కోల్పోవడంతో ఉచిత పథకాల కోసం ఎగబడు తున్నారు. తమ కులాలకు, వర్గాలకు ఫలానా పథకం వర్తించలేదని గగ్గోలు చేస్తున్నారు. గతంలో వీరంతా ఇలాంటి పథకాల జోలికి రాలేదు. కానీ సంక్షోభం కారణంగా వీరంతా కొనుగోలు శక్తిని కోల్పోయారు. జనాభాలో చివరి 50 శాతంగా ఉన్న పేదలు, అల్పాదాయ వర్గాల ప్రజలు జాతీయాదాయం లో 25.5 నుండి 15.8 శాతం మధ్య ఆదాయ వాటాను కలిగి ఉన్నారని కుటుంబ సర్వేలు తెలిపాయి. కాబట్టి జాతీయ అంతర్జాతీయ నివేదికలు వేటిని పరిశీలించినా అదానీ, అంబానీ, టాటా, బిర్లా వంటి శత కోటీశ్వరుల సంపద పెరగడం, పేదలు మరింత నిరుపేదలవుతున్న వాస్తవాన్ని నివేదిస్తున్నాయి. ఇది ముమ్మాటికీ నిజం. కూలీనాలీ చేసుకునే వారు ఉన్నంతలో పస్తులు లేకెండా గడుపుతున్నారు. అఇతే పేదలు,మధ్యతరగతి ప్రజలు ఎటూ తేల్చుకోలేక నలిగిపోతున్నారు. ఈ పరిస్థితి మారాలంటే కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. ఉపాధి అకాశాలు పెంచడం, ప్రజల కొనుగోలు శక్తి పెంచేలా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా జిఎస్టీ తదితర పన్నులను తక్షణం సమీక్షించాలి.

# రాష్ట్ర బడ్జెట్ లో జీహెచ్ఎంసీకి రూ.3101.21 కోట్లు కేటాయించడం పై మేయర్ హర్షం

హైదరాబాద్, మార్చి 19, (సమయం న్యూస్) :: రాష్ట్ర బడ్జెట్ లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు రూ.3101.21 కోట్లు కేటాయించడం పై నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి జిహెచ్ఎంసి ఆర్థిక ఇబ్బందులు గట్టెక్కించేందుకు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి వర్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో జిహెచ్ఎంసి ఉద్యోగుల జీతభత్యాలు చెల్లించడం కష్టంగా ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం



అధికారంలోకి రాగానే బడ్జెట్ లో 10 వేల కోట్లు కేటాయించడం జరిగిందని, ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ హామీ అమలు చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ద్వారా జిహెచ్ఎంసి కి రావాల్సిన 3030కోట్లు విడుదల చేసినట్లు మేయర్ వెల్లడించారు. ఇట్టి నిధులతో ఉద్యోగుల వేతనాలు మొదటి తేదీన జీతాలు చెల్లింపుతో పాటుగా మౌలిక సదుపాయాలు కల్పించడం, ప్రతి జోన్ కు 25కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మేయర్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ఎంసికి ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయింపు చేసిన నిధులతో పాటుగా నగర వ్యాప్తంగా ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి హెచ్ సిటీ ద్వారా రూ.7032 కోట్ల అంచనా వ్యాయంతో సుమారు 40పనులు రోడ్డు వెడల్పు, ఆర్ ఓ బి లు, అండర్ పాసులు, ఫ్లైఓవర్ పనులు చేపట్టి హైదరాబాద్ ను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. నగర సుందరీకరణ కు రూ.150కోట్లు, వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్ నిర్మాణాలకు 100 కోట్లు, నాలాల అభివృద్ధికి రూ. 585 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుంతుందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు.

# విరివిగా పంట రుణాలు పంపిణీ చేయాలి

* జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో అదనపు కలెక్టర్



నిజామబాద్, మార్చి 18 ( సమయం న్యూస్) : ఆయా రంగాలకు రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం జరిగింది. ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, వచ్చే రానున్న సీజన్ లో రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలు తదితర అంశాలపై ఆయా బ్యాంకుల వారీగా అదనపు కలెక్టర్ సమీక్షించారు. పూర్తి స్థాయిలో పంట రుణాల లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలని, రుణ పంపిణీ లక్ష్యాన్ని అధిగమించాలని అన్నారు. ఆయా రంగాల్లో పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా, మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉండిపోతున్నాయని అన్నారు. క్రమం తప్పకుండా సమీక్ష జరుపుతూ, వంద శాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలను సమర్థవంతంగా అందించాలని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు గాను అర్హత కలిగిన రైస్ మిల్లర్లకు వెంటదివెంట బ్యాంకు గ్యారంటీలను మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. వ్యవసాయ శాఖతో పాటు ఇతర పశు సంవర్ధక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర శాఖలతో సమన్వయము చేసుకుని ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలని హితవు పలికారు. రుణాలు తీసుకున్న వారు యూనిట్లు స్థాపించారా లేదా అన్నది నిశితంగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తి స్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని, సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యం చేయవద్దని సూచించారు. వీధి వ్యాపారులకు విరివిగా ముద్ర రుణాలతో పాటు స్టాండ్ అప్ ఇండియా కింద రుణాలు అందించాలన్నారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో అందిస్తున్న శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి యూనిట్ల స్థాపన కోసం రుణాలు అందించేందుకు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో ఆర్బీఐ ఎల్.డీ.ఓ పృథ్వీ, డీఆర్డీఓ సాయాగౌడ్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ అశోక్ చవాన్, నాబార్డు ఏజీఎం ప్రవీణ్ కుమార్, మెప్మా పీ.డీ రాజేందర్, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ సురేష్ కుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా కొనసాగేలా కృషి చేయాలి

* నేటి నుండి అందుబాటులోకి కొనుగోలు కేంద్రాలు
* రైతులు ఏ దశలోనూ ఇబ్బందులు పడకూడదు
* సన్నాహక సమావేశంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



నిజామాబాద్, మార్చి19 : (సమయం న్యూస్) యాసంగిలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా సంబంధిత అధికారులు, కేంద్రాల నిర్వాహకులు అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. రైతులు ఎక్కడ కూడా ఏ దశలోనూ ఇబ్బందులు తలెత్తకుండా నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలని అన్నారు. రబీ వరి ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో బుధవారం ఆయా శాఖల అధికారులతో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈఓలు, ఐకెపి సీసీలు, మెప్మా ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఈ నెల 20వ తేదీ నుండి జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో యాసంగిలో సాధారణానికి మించి అధిక విస్తీర్ణంలో వరి పండించారని, లక్షా 69 వేల హెక్టార్ల పైచిలుకు విస్తీర్ణంలో వరి సాగు చేశారని అన్నారు. మొత్తం 11.85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అంచనా వేయగా, 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. ఇందులో 6.80 లక్షల మెట్రిక్ టన్నులు సన్న ధాన్యం, దొడ్డు రకం 2.20 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని నిర్ణయించామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈసారి జిల్లాలో 664 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, వీటిలో సన్న ధాన్యం సేకరణ కోసం 472 కేంద్రాలు, దొడ్డు ధాన్యం సేకరణకు 192 కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ వివరించారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో అత్యధికంగా 481 కేంద్రాలు, ఐకెపి 107, డీసీఎంఎస్ ద్వారా 68, మెప్మా ఆధ్వర్యంలో 8 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు లోబడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తిస్థాయిలో మద్దతు ధర పొందేలా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం 'ఏ' గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ. 2320, సాధారణ రకానికి రూ. 2300 ధర చెల్లించడం జరుగుతుందన్నారు. మద్దతు ధరతో పాటు సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలోనూ రైతులకు అవసరమైన అన్నిమౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పంట విక్రయం విషయంలో రైతులు ఇబ్బందులకు గురికాకుండా, పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా కేంద్రాల వద్ద తగిన నీడ, నీటి వసతి కల్పించాలన్నారు. సరిపడా సంఖ్యలో తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రైతులకు నష్టం వాటిల్లకుండా తూకం, తరుగు వంటి అంశాల్లో జాగ్రత్తగా ఉండాలని, ధాన్యం సేకరణ ముగిసేంత వరకు పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయి మద్దతు ధర అందేలా చూడాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఉందన్నారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు ప్రతిరోజూ క్రమం తప్పకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శిస్తూ కొనుగోళ్ల ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ చేయాలని, ఏమైనా సమస్యలు గమనించిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. రైతుల నుండి ధాన్యం సేకరించిన వెంటనే టాబ్ ఎంట్రీలు జరపాలని, తద్వారా వారికి త్వరితగతిన చెల్లింపులు జరిగేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. బిల్లుల చెల్లింపుల్లో అనవసర తప్పిదాలకు పాల్పడుతూ, నిర్లక్ష్యానికి తావిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సంబంధిత శాఖల అధికారులందరూ సమిష్టిగా, సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాలకు లోబడి బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా క్షేత్ర స్థాయిలో రైతులను చైతన్యపరచాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతుల నుండి ఏ చిన్న ఫిర్యాదు సైతం రాకుండా చూసుకోవాలని, ధాన్యం సేకరణలో క్షేత్రస్థాయి అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం రవాణాకు సరిపడా సంఖ్యలో వాహనాలను సమకూర్చుకోవాలని, ధాన్యం ఎగుమతులు, దిగుమతులు వెంటదివెంట జరిగేలా అవసరమైన సంఖ్యలో హమాలీలు ఏర్పాటు చేసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ చేసేందుకు తగిన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, బాగా ఆరబెట్టిన, శుభ్రపర్చిన ధాన్యం మిల్లులకు పంపాలని అన్నారు. నాణ్యతా ప్రమాణాలను సాకుగా చేసుకుని రైతులను నష్టపర్చే ప్రయత్నాలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, రైతుల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశమైనందున ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని కలెక్టర్ అధికారులకు హితవు పలికారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను అన్ని కేంద్రాలకు సమకూరుస్తామని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట రైస్ మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని, ఏ చిన్న ఇబ్బందికి సైతం తావులేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కాగా, రైతులు దళారులకు ధాన్యం కట్టబెట్టి మోసపోకుండా, ప్రభుత్వపరంగా ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, రాజా గౌడ్, జెడ్పి సిఈఓ సాయాగౌడ్, సివిల్ సప్లయిస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, మెప్మా పీ.డీ రాజేందర్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు లేకుండా సకల సౌకర్యాలు కల్పించండి

* **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.**
* **వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని భక్తుల సౌకర్యార్థం. రాజ గోపురం నుండి గుడి వరకు చలువ పందిళ్ళు ఏర్పాటు**
* **ఏడుపాయల వనదుర్గ మాత అమ్మవారి దేవాలయ పరిసర ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్**
* **రాహుల్ రాజ్**





మెదక్ మార్చి19. (సమయం న్యూస్): వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంగా రాజగోపురం నుండి గుడి వరకు చలువ పందిళ్లు, ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టామని,కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా మాత అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని కలెక్టర్ సంబంధిత తాసిల్దార్, ఆలయ అర్చకులు, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. దేవాలయ ప్రాంగణం అంతా కలియ తిరిగి భక్తులు దర్శనానికి ఏ రోజు ఎంత మంది వస్తున్నారు, మంగళ, శుక్ర, ఆదివారం భక్తుల రద్దీ, సౌకర్యాల గురించి కలెక్టర్ ఆలయ నిర్వాహకులు, తాసిల్దార్స్ ను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో భక్తులకు ఎండ నుండి ఉపశమనం కలిగించడం కొరకు త్రాగు నీరు .చలువ పందిళ్లు నిర్మాణం ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసి భక్తులకు ఉప యోగాలకు తీసుకురావాలని, త్రాగునీరు అందుబాటులో ఉంచాలని సౌకర్యాలపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట తాసిల్దార్ సతీష్, ఆలయ ప్రధాన పూజారి శంకర్ తదితరులు పాల్గొన్నారు

# గవర్నర్ దత్తత గ్రామ ప్రజలకు దుప్పట్లు, యూనిఫాం పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా





**ఆదిలాబాద్ మార్చి19( సమయం న్యూస్):** గవర్నర్ దత్తత తీసుకున్న బుర్కి గ్రామాన్ని సందర్శించి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామస్తులకు దుప్పట్లు, విద్యార్థులకు యూనిఫాం లను అందజేసిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బూ గుప్తా. అదిలాబాద్ రూరల్ బుర్కి గ్రామాన్ని బుధవారం జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఓ సందర్శించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన వాహనం లో బుర్కి గ్రామానికి చేరుకున్నారు. గ్రామస్తులు సంప్రదాయ పద్ధతిలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం లో ట్రైబల్ వెల్ఫేర్ EE, DWO, ఆర్ అండ్ బి, మిషన్ భగీరథ, ఫారెస్ట్, rws, వ్యవసాయ శాఖ AO, వివిధ ఆయా శాఖల అధికారులు, ఎంపిడిఒ, mpo, తదితరులు గ్రామం లో చేపట్టిన అభివృద్ధి పనుల తీరును కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో అన్ని మౌలిక వసతులు, అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని, ఈ గ్రామం లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించడం జరుగుతుందని, అంగన్వాడి భవనం, కమ్యూనిటీ హాల్ నూతనంగా నిర్మించడం జరిగిందన్నారు. రహదారి నిర్మాణానికి అంకోలీ నుండి భుర్కి గ్రామానికి 6 కిలో మీటర్లు ఉంటుందని, రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, ముందుగా రెవెన్యు కు సంబంధించి 1.6 కిలో మీటర్లు BT రోడ్డు నిర్మాణం, తదుపరి అటవీ శాఖ అనుమతుల తో మిగితా. రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు. ఈ నిర్మాణ పనులు మార్చి చివరి లోగా పూర్తి చేయాలనీ ee ట్రైబల్ వెల్ఫేర్ ను ఆదేశించారు. ఓపెన్ వెల్ కు రిటర్నింగ్ వాల్ ఏప్రిల్ 7th వరకు పూర్తి చేయడ్లను rws ను ఆదేశించారు. అలాగే సోలార్ ద్వార నీటి సదుపాయం కల్పించడానికి సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రెడ్ సి సంస్థ ముందుకు వచ్చిందని అన్నారు. ఐటిడిఏ ద్వారా 20 మందికి డీజిల్ ఇంజన్, స్ప్రి ఉర్లు, ట్రాక్టర్, క్రషర్ ఏర్పాటు చేయడం జరుగుతుందనీ ఐటిడిఎ పిఓ తెలిపారు. అంగన్వాడి ద్వారా పోషకాహారం అందించడం జరుగుతున్నదని, అంగన్వాడి టీచర్, crt తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని తెలిపారు. మారుమూల గిరిజనులు నివాసమైన బుర్కి గ్రామాన్ని గవర్నర్ దత్తత తీసుకొని ప్రణాళిక ప్రకారం గిరిజనులకు పోషకమైన ఆహారాన్ని అందించడానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (IRCS) సభ్యులు పనిచేస్తున్నారని, వీరి ఆద్వర్యం లో దుప్పట్లు, యూనిఫాం గ్రామస్తులకు, విద్యార్థులకు కలెక్టర్, ఐటిడిఏ పీవో చేతుల మీదుగా అందించారు. అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లల హాజరు శాతాన్ని, పౌష్టికాహారం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద సోనేరావు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

# పట్టణాల అభివృద్ధికి కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగించాలి

* **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్ మార్చి19 (సమయం న్యూస్) : పట్టణాల అభివృద్ధికి కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగించాలి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలలో వివిధ అభివృద్ధి పనులకు మంజూరైనా నిధులను పారదర్శకంగా వినియోగించాలని సూచించారు. మున్సిపాలిటీల వారిగా కేటాయించిన నిధులు, చేపట్టిన పనులు, ఖర్చు చేసిన నిధులు, అందుబాటులో ఉన్న నిధులకు సంబంధించిన వివరాలను ఆయా అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గత వానాకాలం వరదల వల్ల నష్టపోయిన మౌలిక సదుపాయాలకు మరమ్మత్తుల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ కార్యాలయాలు, తదితర భవంతుల విద్యుత్ బిల్లులు సమయానికి చెల్లించాలన్నారు. అధికారులంతా ఆదాయ సృష్టిపై దృష్టి సాధించాలన్నారు. మున్సిపాలిటీల పరిధిలోని పార్కులన్నింటిని అభివృద్ధి చేయాలన్నారు. సుందరీకరణ పనులను చేపట్టి ప్రజలను పార్కులకు వచ్చే విధంగా ఆకర్షించాలన్నారు. పార్కుల్లో పచ్చదనం పెంపొందించలన్నారు. గేట్లు, గోడలకు పెయింటింగ్ వేసి, మెరుగైన లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ వాసులను భాగస్వామ్యం చేస్తూ, పార్కులకు అసోసియేషన్ ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ శాఖకు సంబంధించి వచ్చిన సమాచార హక్కు చట్టం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, జాదవ్ కృష్ణ, రాజేష్ కుమార్, మున్సిపల్ అధికారులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఆరోగ్య కేంద్రాలకు జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్ రావడంపై అభినందనలు

* **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ మార్చి19,( సమయం న్యూస్):** జిల్లాలోని నాలుగు ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్ లభించిందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. జిల్లా లోని సారంగాపూర్ మండలం చించోలి.బి, లక్ష్మణచందా మండలం మల్లాపూర్, ముధోల్ మండలం తరోడ, బాసర మండలంలోని కౌట నాలుగు ఆరోగ్య కేంద్రాలకు ఈ జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్లు లభించినట్లు తెలిపారు. జాతీయ స్థాయి బృందం అన్ని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు





# ప్రవచనాలు ఎక్కువ... పైసలు తక్కువ

* **అప్పుల విషయంలో కేసీఆర్ పై చేసిన ప్రచారం తప్పని రుజువైంది**
* **అరకొర కేటాయింపులతో అభివృద్ధి, సంక్షేమం ఎలా సాధ్యమవుతుంది ?**
* **వాస్తవిక అంచనాలతో బడ్జెట్ లేకపోవడం దారుణం**

హైదరాబాద్: "కోట్స్ ఎక్కువ ఫాక్స్ తక్కువ.... ప్రవచనాలు ఎక్కువ పైసలు తక్కువ" అన్నట్టుగా బడ్జెట్ ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. చెప్పిన విషయాలనే పదేపదే చెప్పడం తప్ప అందులో వాస్తవాలు ఏమి లేవని తెలిపారు. అన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం అరకొరా నిధులు కేటాయించిందని, కొత్త పథకాలు ఏవి కేటాయించలేదని తెలిపారు. వాస్తవిక అంచనాలతో బడ్జెట్ రూపొందించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నాడు ప్రవేశపెట్టిన బడ్జెట్ మీద ఎమ్మెల్సీ కవిత స్పందిస్తూ....తీసుకున్న రుణాలకు గాను ఈ ప్రభుత్వం గత ఏడాది కాలంగా కట్టిన వడ్డీతో సహా తిరిగి చెల్లించిన మొత్తం కేవలం రూ. 30 వేలు మాత్రమే అని బడ్జెట్ లెక్కలు స్పష్టంగా చెబుతున్నాయని, కానీ రూ లక్షా 40 వేల కోట్లు అప్పులు కట్టామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పారని ధ్వజమెత్తారు. కెసిఆర్ గారు రాష్ట్రాన్ని హక్కుల పాలు చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అబద్ధపు ప్రచారం చేసినట్లు బడ్జెట్ పుస్తకాలు నిరూపించాయని ఎండగట్టారు. తెలంగాణ ఏర్పడ్డప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రం చేసిన అప్పులు మొత్తం నాలుగు లక్షల 37 వేల కోట్లు అని ప్రభుత్వమే స్వయంగా బడ్జెట్లో పేర్కొందని, మరి కెసిఆర్ గారు ఏడున్నర లక్షల కోట్లు అప్పు చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలా ఆరోపిస్తారని నిలదీశారు. ఇప్పటివరకు చేసిన అప్పుల్లో గత ఏడాదికాలంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అప్పు లక్షా 54 వేల కోట్లు ఉందని ఎండగట్టారు.

* **కాంగ్రెస్ అసమర్థతోనే రాష్ట్రంలో కరువు: ఎమ్మెల్సీ కవిత**

ఎండల వల్లే రాష్ట్రంలో పంటలు ఎండుతున్నాయని కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. గతేడాది వర్షాలు సమృద్ధిగా పండాయని, ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వాటర్ మేనేజ్‌మెంట్ తెలియకపోవడంతోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో మిషన్ కాకతీయ ద్వారా కేసీఆర్ చెరువులు నింపారన్నారు. ఎండిన పంటలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలి ఆవరణలో కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ఆయకట్టు కింద ఉన్న పొలాలు కూడా ఎండిపోతున్నాయన్నారు. మార్చిలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృష్ణా నది నుంచి 10 వేల క్యూసెక్కుల నీళ్లు ఎత్తుకుపోతుంటే చూస్తూ ఊరుకుంటున్నారని విమర్శించారు.



# రిమ్స్ లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

* **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్ మార్చి19,(సమయం న్యూస్) :** రిమ్స్ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడంలో వైద్యులు వైద్య సిబ్బంది ముందుండాలని అన్నారు. రిమ్స్ వైద్య కళాశాలలో బుధవారం సాయంత్రం రిమ్స్ డైరెక్టర్ అధ్యక్షతన అన్ని శాఖల ప్రొఫెసర్లు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రిమ్స్ ఆస్పత్రికి వచ్చే వారందరూ పేద ప్రజలేనని పేదలను దృష్టిలో ఉంచుకొని వైద్య సేవలు అందించాలని, ముఖ్యంగా గైనకాలజీ డిపార్ట్మెంట్లో అన్ని రకాల డెలివరీస్ చేయాలని రిఫరల్ లేకుండా చూడాలని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులకు డెలివరీ నిమిత్తం వెళ్తున్నారని డెలివరీ కొరకు ప్రభుత్వ ఆసుపత్రి ,రిమ్స్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరం ఉన్న మహిళలకు టుబెక్టమి చేయడంలో ముందుండాలని తెలిపారు. అన్ని శాఖల ప్రొఫెసర్ల ను వారి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పేషెంట్లు ను చూసుకునేందుకు పేషెంట్ కేర్లు ఉన్నారని రోగులకు ఎలాంటి అవసరాలు ఉన్న పేషంట్ కేర్ ద్వారానే చేయించాలని తెలిపారు. ఎక్స్రే ఈసీజీ స్కానింగ్ రక్త పరీక్షలు తోపాటు అన్ని రకాల పరీక్షలకు సంబందించి ప్రొఫెసర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నర్సింగ్ కళాశాలలో ఎన్ని పోస్టులు ఖాళీలు ఉన్నాయి ఏ ఏ పోస్టు ఖాళీల ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు ప్రిన్సిపాల్ సమాధానం ఇస్తూ ఇటీవల ఈ ఏడాది ఎంఎస్సీ నర్సింగ్ కొరకు అప్లై చేశామని తెలిపారు 8 మంది స్టాఫ్ నర్సులను టీచింగ్ ఫ్యాకల్టీ కోసం తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఆర్ ఎం ఓ లు ఎంతమంది ఉన్నారు ఏమేం పని చేస్తున్నారు విధులు బాధ్యతలు ఏంటి అని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ నీ ప్రభుత్వం ఐదు లక్షల నుంచి పది లక్షల పెంచిందని ఆరోగ్యశ్రీలో పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జయసింగ్ రాథోడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేంద్ర రాథోడ్, ఆస్పత్రి సూపరిండెంట్లు అశోక్ డాక్టర్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



## బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**హనుమకొండ, మార్చి19( సమయం న్యూస్) :** హనుమకొండ జిల్లా భీమారం పలివేల్పుల రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డైనింగ్ హాల్, వాష్ ఏరియాను పరిశీలించారు. స్టోర్ రూమ్ లో భద్రపరిచిన కూరగాయలు, కోడిగుడ్లు, ఇతర ఆహార పదార్థాలను కలెక్టర్ పరిశీలించారు. డైనింగ్ హాల్లో భోజనం చేస్తున్న విద్యార్థినులతో పాటు తరగతి గదుల్లో ఉన్న విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. హాస్టల్ ప్రాంగణం పరిశుభ్రంగా ఉండే విధంగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సుభాషిణి ని కలెక్టర్ ఆదేశించారు. డైనింగ్ హాల్, వాష్ ఏరియా, కారిడార్ పరిసరాలు, కొన్ని ఆహార పదార్థాలు బాగా లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పరిశుభ్రత చర్యలు చేపట్టాలని హాస్టల్ ప్రిన్సిపల్ ను ఆదేశించారు. టాయిలెట్స్ మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.



## వేగవంతంగా కమర్షియల్ ట్రేడ్ వసూలు చేయండి

**: బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే**

* **ట్రేడ్ వసూళ్ల పురోగతి పై ఉన్నతాధికారులకు దిశా నిర్దేశ్యం**

**వరంగల్ కార్పొరేషన్ మార్చి 19, (సమయం న్యూస్) :** వేగవంతంగా కమర్షియల్ ట్రేడ్ వసూలు చేయాలని బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. బుధవారం కమర్షియల్ ట్రేడ్ పన్ను వసూళ్ల పై ప్రజారోగ్య విభాగ ఉన్నతాధికారులు డిప్యూటీ కమిషనర్ లతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కమర్షియల్ ట్రేడ్ వసూళ్ల ను వేగవంతం చేయడానికి సానిటరీ ఇన్స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులు జవాన్లతో బృందాలు ఏర్పాటు చేసి కాజీపేట సర్కిల్ కు 7 బృందాలు కాశిబుగ్గ సర్కిల్ కు 7 బృందాలను కేటాయించి ప్రతి రోజు పెద్ద మొత్తం లో బకాయి లు ఉన్న కమర్షియల్ షాపు పై ప్రత్యేక దృష్టి సారించి ట్రేడ్ వసూళ్లు జరిపేలా ప్రణాళిక బద్దం గా చర్యలు చేపట్టాలని ఆస్తి పన్నుల వసూళ్లలో గడువు లోగా లక్ష్యాన్ని చేరుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి రవీందర్ ఎంహెచ్ఓ డా. రాజేష్ ఐటి మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల అభివృద్ధికి ఆటంకాలు లేకుండా చేస్తాం

* **సీఎస్ ఆర్ నిధులతో సంస్థలు ముందుకు రావాలన్న హైడ్రా**

**హైదరాబాద్, మార్చి 19, సమయం న్యూస్ :** ఔటర్ రింగు రోడ్డు పరిధిలో చెరువుల అభివృద్ధికి ఉన్న ఆటంకాలన్నీ తొలగిస్తాం.. సిఎస్ ఆర్ నిధులతో కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు కోరారు.



* చెరువుల సుందరీకరణకే పరిమితం కారాదని.. చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టాలని సంస్థలకు సూచించారు.
* చెరువుల అభివృద్ధికి సీఎస్ ఆర్ నిధులు వెచ్చిస్తున్న, వెచ్చించడానికి సిద్ధంగా ఉన్న దాదాపు 72 సంస్థల ప్రతినిధులతో హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు బుధవారం సమావేశమయ్యారు.
* జీహెచ్ ఎంసీ లేక్స్ విభాగం అదనపు కమిషనర్ కిల్లు శివ కుమార్‌నాయుడు. తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ సీఎస్ ఆర్ వింగ్ డైరెక్టర్ అర్చనా సురేష్‌తో పాటు.. హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.
* మాధాపూర్‌లోని సున్నం చెరువు, తమ్మిడికుంట, కూకట్‌పల్లిలోని నల్ల చెరువు, ఉప్పల్‌లోని నల్లచెరువు, అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, పాతబస్తీలోని బమ్రుక్నుద్దీన్ దౌలా చెరువులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని.. కమిషనర్ చెప్పారు.
* ఔటర్ రింగురోడ్డు పరిధిలో 1025 చెరువులుండగా.. ఇందులో 61 శాతం జాడ లేకుండా ఉన్నాయని.. ఉన్న 39 శాతం చెరువులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కమిషనర్ చెప్పారు.
* చెరువులను పరిరక్షించుకోకపోతే.. పర్యావరణ సమతుల్యత దెబ్బతిని.. భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందనే విషయాన్ని అందరూ గుర్తెరగాలన్నారు.
* చెరువుల్లో పూడిక తీయడం, చెరువులోకి మురుగు రాకుండా కాలువలను డైవర్ట్ చేయడం, ఎస్‌టీపీల ఏర్పాటుతో మంచినీటి చెరువులను తయారు చేయడం అందరి లక్ష్యం కావాలి.
* చెరువు అభివృద్ధితో ఆయా సంస్థలకు మంచిపేరు రావాలనేదే హైడ్రా ప్రయత్నం... కాని అక్కడ కొంత భూమిని సొంతం చేసుకోవా లనే ప్రయత్నాలను హైడ్రా అడ్డుకుంటుంది..
* చెరువులు అభివృద్ధి చేస్తున్న సంస్థలకు క్షేత్ర స్థాయిలో ఎదురౌతున్న ఇబ్బందులను అడిగి ఈ సందర్భంగా కమిషనర్ తెలుసుకున్నారు.
* ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, ఆక్రమణల తొలగింపు, మురుగు కాలువలను మళ్లించడం, అనుమతుల కోసం వివిధ శాఖల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఇబ్బందిగా పరిణమించాయని పలు సంస్థల ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు.
* చెరువుల అభివృద్ధికి ఉన్న ఆటంకాలన్నీ తొలగిస్తాం... వివిధ శాఖల మధ్య సమన్వయ పాత్ర హైడ్రా పోషిస్తుంది.. సింగిల్ విండో మాదిరి అనుమతులు మంజూరయ్యేలా చూస్తాం.. మీరు పూర్తిస్థాయిలో చెరువులను తీర్చిదిద్దాలని ప్రతినిధులను కమిషనర్ కోరారు.
* మురుగు కాలువల మళ్లింపు, ఎస్‌టీపీల ఏర్పాటు, వరుసగా 5 ఏళ్లు నిర్వహణకు బాధ్యత పడాలన్నారు. చెరువుల నిర్వహణకు అవసరమైన నిధులు సమకూరేలా కూడా ఏర్పాట్లు చేయాలన్నారు.
* పెద్దచెరువుల అభివృద్ధికి నాలుగైదు సంస్థలు కలసి ముందుకు రావాలని, అప్పుడు నిధుల ఇబ్బందులుండవని సూచించారు.
* ఐటీ కారిడార్‌లోనే కాకుండా.. నగరం నలువైపులా ఉన్న చెరువుల అభివృద్ధికి సంస్థలు ముందుకు రావాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ కోరారు.
* చెరువుల బఫర్‌జోన్లో జులై 2024 కి ముందు నిర్మించి నివాసాలుంటున్న కట్టడాలతో పాటు.. అనుమతులు పొందిన నిర్మాణాలను తొలగించమని.. అక్కడ వాణిజ్య కార్యక్రమాలకోసం నిర్మించిన వాటిని తొలగిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.
* ఎన్ ఆర్ ఎస్‌సీ, సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ రికార్డులతో పాటు.. విలేజ్ మ్యాప్‌ల ఆధారంగా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కూడా మే నెల నాటికి పూర్తవుతుందని.. దీనిని ఎంతో పారదర్శకంగా చేస్తున్నామని చెప్పారు.

# రైతులకు నాణ్యమైన మెరుగైన విద్యుత్ సరఫరా

* **ఎన్ పి డి సి ఎల్ సి ఎం డి కే.వరుణ్ రెడ్డి.**

**హనుమకొండ మార్చి 19 ( సమ యం న్యూస్) :** హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ప్రధాన సమావేశ మందిరంలో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ 202526 ఆర్థిక సంవత్సరానికి సవరణ చేయబడిన ఆదాయ ఆవశ్యకత రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ సర్ చార్జీల ప్రతిపాదనలపై ఏర్పాటు చేసిన బహిరంగ విచారణ కార్యక్రమం టి జి ఈఆర్ సి చైర్మన్ జస్టిస్ డాక్టర్ దేవరాజు నాగార్జున, టీజీ ఎన్పీడీసీఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అభ్యంతరాలు వ్యక్తం చేసిన ఆబ్జెక్టరుకు సీఎండి శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి గారు సమాధానాలు ఇస్తూ రైతు నేస్తంగా పని చేస్తున్నామని రైతులకు మెరుగైన నాణ్యమైన సేవలు అందిస్తున్నామని, విద్యుత్ అధికారులందరూ నిబద్ధత పనిచేస్తున్నారని స్పష్టం చేశారు.వినియోగ దారులకు మెరుగైన , నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని పేర్కొన్నారు. పొలాల మధ్య ఉన్న ట్రాన్స్ఫార్మర్లను అంచనాలు రూపొందించి రోడ్ ప్రక్కకు మార్చడానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 1912 టోల్ ఫ్రీ నంబర్ అన్ని ట్రాన్స్ఫార్మర్ల పైన రాయించడం జరుగుతుందని వివరించారు . ప్రతి 33 కెవి , 11 కెవి పోల్ ల మీద యూనిక్ నంబర్ లు రాయిస్తున్నామని తెలిపారు . ప్రతి గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి అక్కడే సమస్యలు పరిష్కారం అయ్యేలా తగు చర్యలు తీసుకుంటామని అందుకు తగ్గట్టుగా కార్య చరణ ప్రణాళిక రూపొందించుకుంటామని అన్నారు . ప్రతి గ్రామపంచాయితీ కార్యాలయాల్లో సిటిజెన్ చార్టర్ పెడతామని పేర్కొన్నారు . ప్రభుత్వం నుండి అనుమతులు రాగానే జె ఎల్ యం , సబ్ ఇంజనీర్ , అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల నియామకం చేపడ తామని తెలిపారు . నష్టపరిహారం రాలేదని తెలిపిన వారికి సమాధానం ఇస్తూ, అనుమతులు ఇచ్చామని వెంటనే మంజూరు అవుతాయని తెలిపారు . లూజ్ లైన్ లు , ట్రాన్స్ఫార్మర్ల గద్దెలు ఎటు పెంచుతామని , దశల వారీగా పనులు జరుగుతున్నాయని అన్నారు. 6, 7 నెలల్లో పూర్తి చేస్తామని అన్నారు . తదనంతరం .. చైర్మన్ డాక్టర్ దేవరాజు నాగార్జున మాట్లాడుతూ గ్రామ , గ్రామాన వినియోగదారులకు చైతన్యం కలిపించేలా ఆవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామా , గ్రామాన



క్యాంపు లు చేపట్టాలని తెలిపారు . అక్కడే సమస్యలు పరిష్కరించేలా సత్వర చర్యలు తీసుకోవాలని అన్నారు . ఎటువంటి విద్యుత్ టారిఫ్ పెంపు లేదని అన్నారు . మెరుగైన సేవలు అందిస్తున్న ఎన్పీడీసీఎల్ యాజమాన్యాన్ని అభినందించారు .

# ఆర్ టి సి ప్రైవేటీకరణకు కేంద్రం దొడ్డిదారిన కుట్ర

* **రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు ఆగ్రహం.**

పర్యావరణ పరిరక్షణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆర్ నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా రవాణ వ్యవస్థ అయిన ఆర్ టి సి దొడ్డి దారిన ప్రైవేటీకరించేందుకే ఎలక్ట్రికల్ బస్సులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని వారు ఆరోపించారు. అనేక వ్యవ ప్రయాసాలకు తట్టుకుంటూ రాష్ట్ర ప్రజలకు సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్న ఆర్ టి సి కి కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్ బుధవారం సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఆర్ పరిరక్షిద్దాం ప్రజా సేవను కొనసాగిద్దాం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ ఏ కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ స్వాగతం పలికారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ఎంఎల్ ఏ ప్రొఫెసర్ కోదండరామ్, నూతనంగా ఎన్నికైన సిపిఐ ఎంఎల్ సీ నెల్లికంటి సత్యం, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జి. నరసింహారావు, సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు



ఎండి. యుసుప్, వామపక్ష పార్టీలు నాయకులు, జానకిరాములు (ఆర్ సి.హెచ్.మురహరి (ఎస్ ఎం.హన్ లైన్), కె.గోవర్ధన్ (న్యూడెమోక్రసీ), ఆర్ జెఎసి చైర్మన్, ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈ.వెంకన్న, కోచైర్మన్, థామస్ ఆర్ టి సి ఎంప్లాయిస్ అధ్యక్షులు ఎస్.బాబు, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. అంజయ్య నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.కాంతయ్య, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం, ఆర్ టి సి జెఎసి నాయకులు చల్లారాంరెడ్డి, సత్యపాల్, జ్యోతి , భరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ఆర్ టి సి కి సంబంధించి ప్రధానంగా మూడు సమస్యలు ఉన్నాయని, అందులో మొదటిది ఆర్థిక సమస్యలు, రెండవది యూనియన్ల పునరుద్ధరణ, మూడవది ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ అని వివరించారు. ఇప్పుడు మరింత పెద్ద సమస్య దొడ్డి దారిన ఆర్ టి సినీ ప్రవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడం అన్నారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో తీసుకువస్తున్న ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్రాల్లో అతి పెద్ద ప్రజా రవాణా సంస్థలైన ఆర్ టీ సీ కి కాకుండా కార్పొరేట్ సంస్థలకు మాత్రమే కేటాయించడం, ఆర్టీసీ బస్సులను అనివార్యంగా అద్దె రూపంలో తీసుకుని వాటికి డబ్బులు చెల్లించాల్సి పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రప్రభుత్వం సైతం ఏమి చేయలేని పరిస్థితి నెలకొందని, దీంతో ఆర్టీసీ సంస్థకు అద్దెలు మరింత భారంగా మారనుందని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగుల సంఖ్య కూడడా గననీయంగా తగ్గనుండడంతో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికులకు తీరని అన్యాయం జరగుతుందని తెలిపారు. ఈ సమస్యలన్నింటికి పరిష్కారంగా కేంద్రం ప్రభుత్వం సబ్సిడి కింద ఇస్తున్న ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ సంస్థలకే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రోజువారిగా లక్షాలాది మందిని సురక్షితంగా గమ్యస్థానాల చేరవేయడంతోపాటు ప్రత్యక్షంగా 41 వేల మందికి ఉద్యోగాలను పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఆర్టీసీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన అవసరముందన్నారు. ప్రజా రవాణ వ్యవస్థ అయిన రైల్వేకు డిజిల్ పన్ను 4 శాతం ఉంటే , నిరుపేద ప్రజలకు అతి తక్కువ ఛార్జీలతో రవాణాను అందిస్తున్న ఆర్టీసీ నుంచి మాత్రం 18 శాతం వసూళ్లు చేయడం అన్యాయమన్నారు. ఆర్టీసీ బస్సులకు టోల్ మినహాయింపులతో పాటు 5 ఏళ్ల పాటు ట్యాక్స్ హాలిడేను ప్రకటించాలని కోరారు. అదేవిధంగా ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి వారికి న్యాయం చేయాలని ,యూనియన్లను పునరుద్ధరించడం ద్వారా వారికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కూనంనేని సాంబశివరావు కోరారు. నెల్లికంటి సత్యం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రయాణ సౌకర్యాలను అందిస్తున్న అతి పెద్ద సంస్థ ఆర్టీసీ ప్రభుత్వం పరిరక్షించాలని కోరారు. ఇందుకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్రప్రభుత్వం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కలిసి ఆర్టీసీ నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. కేంద్రం ఒక ఎలక్ట్రిక్ బస్సుకు రూ.40లక్షల వరకు సబ్సిడి ఇస్తుండగా, రాష్ట్రప్రభుత్వం ట్యాక్స్ మినహాయింపు ఇస్తున్న నేపథ్యంలో ఈ బస్సులను ఆర్టీసీ కి కేటాయిస్తే ఇటు సంస్థకు అటు ప్రజలకు మరింత మెరుగైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని డిమాండ్ చేశారు. ఆర్టీసీ జెఎసి నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారం చేపట్టి 15 నెలలు కావస్తున్నా ఆర్టీసీ విలీనం ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉందన్నారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్దరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినా ఆ సమస్యను నేటికి పరిష్కరించలేదని, దీంతో చిన్న చిన్న తప్పులకే అధికారులు ఉద్యోగులను తొలగించి, వారి కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె బాట పడుతామని వారు హెచ్చరించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఆర్టీసీ పరిరక్షణతో పాటు కార్మిక సమస్య పరిష్కారానికి సంబంధించి ప్రతి హామిని నేరవేర్చాలని వివిధ వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు.



వెనుకబడిన విద్యార్థుల కొరకై అనగా సి గ్రేడ్ విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంచడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత లెర్నింగ్ టూల్స్‌ను బుధవారం నాడు దౌల్తాబాద్ మండలంలోని ప్రాథమిక పాఠశాల ఇందుప్రియాల్ జడ్.పి.హెచ్.ఎస్ ఇందుప్రియాల్ లో మండల విద్యాధికారి గజ్జల కనకరాజు మరియు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎండీ.అఫ్జల్ హుస్సేన్ గార్ల చేతుల మీదుగా ప్రారంభించబడటం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ మండల విద్యాధికారి మాట్లాడుతూ పాఠశాలలో వెనుకబడిన విద్యార్థుల కొరకై వారిలో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థుల కొరకై అభ్యసన స్థాయిని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందుప్రియల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి గారు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సీఆర్పీలు నగేష్, కుమార్ మరియు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

- రాయపోల్. మార్చి 19, సమయం న్యూస్



## లో ప్రెషర్ నీటి సమస్య కు పరిష్కారం కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్

**అంబర్ పేట, మార్చి 19, సమయం న్యూస్:** అంబర్పేట డివిజన్ లో మంచినీటి సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని అంబర్ పేట కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం అంబర్ పేట డివిజన్ పరిధిలోని హైమద్ నగర్ లో లో ప్రెషర్ నీటి సమస్య ఉందని స్థానికులు కార్పొరేటర్ దృష్టి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ స్థానిక అధికారులను పిలిపించి సమ స్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సమస్య భవిష్యత్తులో తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళిక ఏర్పాటు చేసు కోవాలని అదే విధంగా మంచినీటి నల్లాలకు బోర్లు పెట్టకుండా స్థానిక అధికారులు చూడాలని ప్రతి ఒక్క ఇంటికి మంచి నీరు అందించే విధంగా అధికారులు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రంగు సతీష్ గౌడ్, మహమ్మద్ మోసిన్, షేక్ రఫీక్, మహమ్మద్ అజార్, డాక్టర్ మమ్మద్ పాషా, షేక్ నిజాం, ట్రక్, జాంగిర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# క్రీడలకు 465 కోట్ల బడ్జెట్.. ఎల్బీ స్టేడియంలో సంబరాలు

**అంబర్ పేట, మార్చి 19, సమయం న్యూస్:** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో క్రీడల శాఖకు 465 కోట్లు కేటాయించడము గత బడ్జెట్ కన్నా 100 కోట్లు అధికం చేయడం పట్ల తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. క్రీడలకు 456 కోట్ల బడ్జెట్ కేటాయించడం పట్ల క్రీడాకారులు క్రీడా శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ పాలనలో పది సంవత్సరాలు నిర్లక్ష్యానికి గురైన క్రీడలకు రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, గత బడ్జెట్లో 365 కోట్లు కేటాయించి, ఈ బడ్జెట్ లో ఇంకో 100 కోట్లు పెంచడం చరిత్రలో నిలిచిపోతుందని



ఆయన అన్నారు. యావత్ తెలంగాణ రాష్ట్ర క్రీడా కుటుంబ సభ్యులంతా ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలియజేస్తున్నారని అయన అన్నారు. పెంచిన బడ్జెట్ తో గ్రామీణ క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, క్రీడా సదుపాయాలు, క్రీడాకారులకు ప్రోత్సాహం, క్రీడా కార్యక్రమాల రూపకల్పన క్రీడ మైదానాల నిర్వహణ, క్రీడ సామాగ్రి పంపిణీ, లాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ వివిధ వినూత్న కార్యక్రమాలు రూపొందిస్తామని ఆయన అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ కోచులు ఉద్యోగులు సిబ్బంది మరియు క్రీడాకారులచే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేసి పెద్ద ఎత్తున టపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అసిస్టెంట్ డైరెక్టర్లు కె ఆర్ బి బట్టర్, అశోక్ కుమార్, కళ్యాణి, పి ఆర్ ఓ సురేష్ కాలేరు, ఎల్బీ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట

- **సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి ప్రాధాన్యత**
- **మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి**

గజ్వేల్, మార్చి 19: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలిసి శ్రీగిరిపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ నిధులను మంజూరు చేస్తూండగా, సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి రూ 5 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుండగా, ఇప్పటికే వివిధ శాఖలకు చెందిన పనుల ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించినట్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కెసిఆర్ ప్రభుత్వ పరంగా అన్ని సదుపాయాలు పొందుతున్నప్పటికీ ఇక్కడి ప్రజలను పట్టించుకోకపోవడం దురదృష్టకరమని నిలదీశారు. ఆయన హయాంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి ఫాంహౌజ్ వీడాల్సిన అవసరం ఉందని, పెండింగ్ పనులను ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తెస్తే నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని తెలిపారు. మూడుసార్లు గెలిపించిన ఇక్కడి ప్రజల బాగోగులు దృష్టిలో పెట్టుకొని కేసీఆర్ బయటకు వచ్చి ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, నేతలు కుమార్, చిమ్మి రెడ్డి, కరుణాకర్ రెడ్డి, యాదగిరి, వూడెం శ్రీనివాస్ రెడ్డి, సురేష్, దప్పు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ లో పేదల సంక్షేమానికి పెద్దపీట

- **ఆరు గ్యారెంటీలకు రూ 56,084 కోట్లు కేటాయింపు**
- **దీర్ఘకాలిక, శాశ్వత ప్రయోజనాల కోసం చారిత్రాత్మక కేటాయింపులు**
- **సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి**



గజ్వేల్, మార్చి 19 : పేదల దీర్ఘకాలిక, శాశ్వత ప్రయోజనాలు లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి బడ్జెట్లో పెద్దపీట వేసిందని డిసిసి అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర బడ్జెట్ పట్ల ఆయన స్పందిస్తూ విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల హామీ మేరకు బడ్జెట్లో రూ. 56,084 కోట్లు ఆరు గ్యారంటీల అమలుకు కేటాయించారన్నారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన రూ. 3,04,965 లక్షల కోట్ల బడ్జెట్లో అభివృద్ధి, సంక్షేమ రంగాలకు, ముఖ్యంగా రైతు సంక్షేమాన్ని కాంక్షిస్తూ నీటిపారుదల రంగానికి రూ 23,373 కోట్లు, వ్యవసాయంకు రూ 24,439 కోట్లు కేటాయించారన్నారు. బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమానికి అత్యధిక నిధులు కేటాయించారన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, పశు సంవర్ధక శాఖలకు ప్రాముఖ్యత కల్పించినట్లు తెలిపారు. అంతేకాకుండా రైతుల నుండి సన్నధాన్యం కొనుగోలు, ఉచిత విద్యుత్, వడ్డీ లేని రుణాలు, మహిళ సంక్షేమం, కార్మిక, పర్యాటక, గృహజ్యోతి పథకాలతో పాటు బియ్యం రాయితీకి రూ 3 వేల కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి రూ 600 కోట్లు కేటాయించగా, యువత, విద్యార్థులను తీర్చిదిద్దే క్రమంలో యంగ్ ఇండియా, రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ 2900 కోట్లు కేటాయించి సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధిని నిరూపించుకున్నట్లు వివరించారు. ఎన్నడూ లేని విధంగా సంక్షేమానికి అభివృద్ధికి కట్టుబడి సేమ్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర బడ్జెట్ పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, గ్రామ నాయకులు కుమార్, చిమ్మి రెడ్డి, అమరేందర్ రెడ్డి, ప్రెగ్నాపూర్ నర్సింలు, చెబర్తి వెంకటేష్, చిన్న మల్లేష్, పెద్దోళ్ల బాలయ్య, పెద్దోళ్ల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



## కెసిఆర్ పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన యూత్ కాంగ్రెస్

గజ్వేల్, మార్చి 19: గజ్వేల్ ఎమ్మెల్యే, మాజీ సీఎం కేసీఆర్ కనబడడం లేదంటూ యూత్ కాంగ్రెస్ గజ్వేల్ నియోజక వర్గ అధ్యక్షుడు అజార్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు బుదవారం గజ్వేల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అజార్ మాట్లాడుతూ మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో లేకుండా, అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా, ఫామ్ హౌస్ కె పరిమితమయ్యారన్నారు. వెంటనే గజ్వేల్ నియోజకవర్గం లో పర్యటించి స్థానిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బైరం రమేష్, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్లో ఆరు గ్యారంటీల ఊసే లేదు

- **దివాలా లో ఉన్న రాష్ట్రంలో రూ.3.40 లక్షల కోట్ల బడ్జెట్ ఎలా వచ్చింది**
- **ప్రతి గ్రామంలో రుణమాఫీ కానీ 50 మంది రైతులు**
- **అధికారంలో ఉన్న కాంగ్రెస్, బిజెపిలు గజ్వేల్ కు నిధులు తేవాలి**
- **కాంగ్రెస్ పాపాలు రైతులు, ప్రజల పాలిట శాపాలు**
- **గజ్వేల్ లో విలేకరుల సమావేశంలో ఎఫ్డిసి మాజీ చైర్మన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి**



గజ్వేల్, మార్చి 19: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో ఆరు గ్యారంటీల ఊసే లేదని, దివాలా తీసిన రాష్ట్రంలో రూ.3.40 లక్షల కోట్ల బడ్జెట్ ఎలా కేటాయింపులు జరిగాయని ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వంద శాతం రుణమాఫీ చేశామని డిప్యూటీ సీఎం విక్రమార్క చెప్పారని, ప్రతి గ్రామంలో రుణమాఫీ కానీ 50 మంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు 13 హామీల అమలుకు రాష్ట్ర బడ్జెట్కు ఎలాంటి పొంతన లేదన్నారు. ప్రజలు హామీలతో భ్రమకు లోనై ఓట్లు వేశారని, కాంగ్రెస్ నాయకులు ప్రజలను రాబందుల్లా దోచుకుంటూ జలగల్లా రక్తం పీల్చుతున్నారన్నారు. కాంగ్రెస్ పాపాలు రైతులు, ప్రజల పాలిట శాపాలుగా మారాయన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకు రూ. నాలుగు లక్షల చొప్పున రూ. 6000 కోట్లు పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆరోపించారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసే వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజలకు అండగా అప్పుడు దీక్ష చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు అధికారంలో ఉండి కూడా ఏమి చేయలేకపోతున్నారని ఆరోపించారు. అధికారంలో ఉండి పంపు గ్రామాల కష్టాలు తీర్చాల్సిన సమయంలో కెసిఆర్ నామాన్ని జపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో చేనేత రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నా, ప్రజలు కష్టాలు పడుతున్నా, భూగర్భ జలాలు అడుగంటి పొలాలు ఎండి రైతులు ఇబ్బందులు పడుతున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్లో కాంగ్రెస్, బిజెపి నాయకులు ప్రజలను పట్టించుకోవడం లేదంటూ కేసీఆర్ పై పోటీపడి ఆరోపణలు చేస్తున్నారని, కెసిఆర్ హయాంలో రూ. 10వేల కోట్ల అభివృద్ధి నియోజకవర్గంలో జరిగిందన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు కూడా గజ్వేల్ కు రూ.10వేల కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేసి చూపించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎఫ్డిసి మాజీ చైర్మన్ ప్రతాపరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, బిఆర్ఎస్ నాయకులంతా కలిసి గజ్వేల్ పోలీస్ స్టేషన్లో బిజెపి నాయకుల పై ఫిర్యాదు చేశారు. కొందరు అల్లరి మూకలు గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తాళాలు పగలగొట్టి కెసిఆర్ను అసభ్య పదజాలంతో దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, రాష్ట్ర నాయకులు ఖాజా విరాసత్ అలీ, పట్టణ అధ్యక్షుడు నవాజ్, వైస్ చైర్మన్ జకీయోద్దిన్, మాజీ జెడ్పిటిసి పంగ మల్లేశం, బొల్లారం ఎల్లయ్య, మాజి కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, ఉప్పల మెట్టయ్య, గుంటుకు రాజు, గంగిశెట్టి రవీందర్, మల్లేశం, బొగ్గుల చందు, మామిడి శ్రీధర్, ఆర్కే శ్రీను, శ్రీనివాస్ రెడ్డి, సర్పంచు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు అహ్మద్, గడియారం స్వామి చారి, దయానంద రెడ్డి తదితరులున్నారు.

# MOVIE TIME

## మోహన్ బాబు బర్త్ డే స్పెషల్.. కన్నప్ప గ్లింప్స్ మాములుగా లేదు..!

**టాకీస్:** టాలీవుడ్ సినిమా స్థాయి పెరగడంతో అన్ని భారీ బడ్జెట్ చిత్రాలే రూపొందుతున్నాయి. వాటిలో కన్నప్ప చిత్రం కూడా ఒకటి. మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు. ఇందులో ప్రభాస్ మరియు అక్షయ్ కుమార్, మోహన్లాల్ వంటి స్టార్స్ ముఖ్యపాత్రలు పోషిస్తుండడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. సినిమా నుండి . తొలుత వచ్చిన టీజర్ పై ట్రోల్స్ రాగా, ఇటీవల రిలీజ్ అయిన టీజర్ మరియు పాటలతో ఈ ట్రోలింగ్ ఆగిపోయింది. ఏప్రిల్ 25న రిలీజ్ కానుండడంతో ప్రమోషన్స్ స్పీడ్ పెంచారు. ఈ క్రమంలోనే నేడు మోహన్ బాబు బర్త్ డే సందర్భంగా గ్లింప్స్ విడుదల చేశారు.




సినిమా నుంచి మోహన్ బాబు పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ఇందులో మోహన్‌బాబు మహాదేవ శాస్త్రి పాత్రలో నటిస్తున్నట్టు అర్థమైంది. గ్లింప్స్‌లో 'ధమ ధమ ధమ ధమ విస్ఫులింగ.. ధిమి ధిమి ధిమి ధిమి ఆత్మలింగ' అంటూ సాగే లిరికల్ సాంగ్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. అందులో మోహన్ బాబు మహాదేవ శాస్త్రిగా పవర్ ఫుల్ లుక్కులో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ గ్లింప్స్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ వీడియోపై మీరు ఓ లుక్కేయండి. మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతోన్న 'కన్నప్ప' సినిమా ని సాంకేతికంగా అత్యున్నత ప్రమాణాలతో రూపొందిస్తున్నారు. విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్, భారీ సెట్లతో సినిమాను ప్రేక్షకులకు మంచి అనుభూతి అందించేలా రూపొందిస్తున్నారు.. ఆధ్యాత్మికత, భక్తి, సాహసం కలబోసిన ఈ కథ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది.



### శబరిమల అయ్యప్ప స్వామిని

## దర్శించుకున్న మోహన్‌లాల్

**టాకీస్:** భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామిని మలయాళ స్టార్ నటుడు మోహన్ లాల్ దర్శించుకున్నాడు. మాల ధరించిన లల్లెట్టన్ ఇరుముడి కట్టుకుని కాలినడకలో అయ్యప్ప దర్శనంకి వచ్చాడు. ఆలయంకి చేరుకున్న మోహన్‌లాల్ 18 మెట్లు ఎక్కి ఆ మణికంఠుడిని దర్శించుకున్నాడు. ఇక మోహన్ లాల్ రాకతో ఆలయ అధికారులు అతడికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. మోహన్ లాల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఎల్2 ఎంపురాన్. మలయాళంలో 2019లో విడుదలై సూపర్ హిట్ అందుకున్న సినిమాకి ఈ చిత్రం సీక్వెల్‌గా వస్తుంది. నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మంజు వారియర్, టోవినో థామస్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా హిట్టు అవ్వాలని కోరుకుంటూ మెహన్ లాల్ అయ్యప్ప దర్శనం చేసుకున్నట్లు తెలుస్తుంది.




టాకీస్: 'అర్జున్‌రెడ్డి' సినిమాలో కథానాయిక షాలినీ పాండే పోషించిన 'ప్రీతి' పాత్రను ఇష్టపడని ప్రేక్షకుడు ఉండడు. ఓ విధంగా ఆ సినిమా విజయంలో ఆ పాత్ర ప్రభావం చాలా ఉంది. ఆ తర్వాత మళ్లీ ఆ స్థాయి పాత్ర షాలినీకి రాలేదనే చెప్పాలి. అయితే..

## ఆ సినిమా ఇంకా బలంగా ఉంటే చేస్తా షాలినీ పాండే

రీసెంట్‌గా ఆమె 'డబ్బా కార్టెల్' వెబ్‌సిరీస్‌లో నటించారు. ఆ సిరీస్ ఓటీటీలో పెద్ద హిట్. అందులో బలమైన మహిళగా కనిపించి, ప్రశంసలందుకుంటున్నది షాలినీ పాండే. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'మరోసారి 'అర్జున్‌రెడ్డి' లాంటి సినిమాలో ప్రీతి తరహా పాత్ర చేయాల్సివస్తే చేస్తారా?' అని ఓ విలేకరి అడగ్గా.. 'నేను కెరీర్ ప్రారంభించిన తొలినాళ్లలో చేసిన సినిమా అది. ఇప్పుడు ఆ పాత్ర గురించి ఆలోచిస్తే అమాయకంగా అనిపిస్తుంది. ఆ పాత్రను ఇంకాస్త బలంగా రాయొచ్చేమో అనుకుంటున్నా. మరోసారి ఆ తరహా పాత్ర వస్తే చేయనని చెప్పను కానీ.. దర్శకుడితో మాట్లాడి కొన్ని మార్పులు చేయించుకొని అప్పుడు చేస్తా. అంతేకాదు, అప్పటికంటే ఇప్పుడు నటిగా పరిణితి చెందాను కాబట్టి ఇంకాస్త భిన్నంగా చేయడానికి ప్రయత్నిస్తా.' అంటూ చెప్పుకొచ్చింది షాలినీ పాండే.




### వరుస సినిమాలతో దూసుకెళ్తున్న

## మీనాక్షి చౌదరి

టాకీస్: మీనాక్షి చౌదరి.. సుశాంత్ 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' మూవీతో టాలీవుడ్‌ను పలకరించిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత మాస్ మహారాజా రవితేజ హీరోగా చేసిన 'ఖిలాడీ'లో నటించి మెప్పించింది. మాస్ పాటకు స్టెప్పులేసి అదరహో అనిపించింది.హాట్ హాట్ అందాలతో కుర్రాళ్లను గిలిగింతలు పెట్టింది. మీనాక్షి చౌదరి. సుశాంత్ 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' మూవీతో టాలీవుడ్‌ను పలకరించిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత మాస్ మహారాజా రవితేజ హీరోగా చేసిన 'ఖిలాడీ'లో నటించి మెప్పించింది. మాస్ పాటకు స్టెప్పులేసి అదరహో అనిపించింది. హాట్ హాట్ అందాలతో కుర్రాళ్లను గిలిగింతలు పెట్టింది. ఆ తర్వాత అడివి శేష్ సరసన 'హిట్-2'లో చేసింది. కెరీర్ బిగినింగ్ లో కాస్త స్లోగా సినిమాలు చేసిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు వరుస సినిమాలతో దూసుకుపోతుంది. కెరీర్ స్టార్టింగ్ లోనే సూపర్ స్టార్ మహేష్ బాబు సినిమాలో నటించే అవకాశం అందుకుంది. మహేష్ బాబు నటించిన గుంటూరు కారంలో నటించి మెప్పించింది. ఇవి కాక రీసెంట్ గా విశ్వక్ సేన్, వరుణ్ తేజ్, దుల్కర్ సల్మాన్ హీరోలు సినిమాల్లో నటించి మెప్పించింది. రీసెంట్ సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ హిట్ అందుకుంది. అలాగే కొన్ని తెలుగు సినిమాలను ఓకే చేసింది. ఇక సోషల్ మీడియా ఈ బ్యూటీ పంచుకునే ఫోటోలు కుర్రాళ్లను తెగ కవ్విస్తున్నాయి. ఇలాంటి లవర్ మనకు రావాలి అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్. తన అందంతో అంతలా నెటిజన్స్‌ను ఆకట్టుకుంటుంది ఈ చిన్నది.

## శ్రీవారిని దర్శించుకున్న ప్రభుదేవ



**టాకీస్:** కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ప్రముఖ డ్యాన్స్ కొరియోగ్రాఫర్, దర్శకుడు ప్రభుదేవా దర్శించుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ప్రభుదేవాకు టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో శేష వస్త్రంతో సత్కరించారు. స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఆలయం వెలుపల ప్రభు దేవాను చూసేందుకు భక్తులు ఉత్సాహం చూపించారు. ఫొటోలు, సెల్ఫీల కోసం ఎగబడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.



## లేడి దర్శకురాలితో నిహారిక ఫీచర్ ఫిల్మ్

**టాకీస్:** మెగా డాటర్ నిహారిక కొణిదెల ఒకవైపు సినిమాలలో నటిస్తునే మరోవైపు నిర్మాతగా రాణిస్తుంది. ఇప్పటికే 'కమిటీ కుర్రోళ్ళు' సినిమాను నిర్మించి సూపర్ హిట్ అందుకున్న ఈ భామ తాజాగా మరో సినిమాను నిర్మించబోతుంది. నిహారిక తన సొంత ప్రొడక్షన్ బ్యానర్ అయిన 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' బ్యానర్‌పై మరో ఫీచర్ ఫిల్మ్ తెరకెక్కించబోతుంది. ఈ ప్రాజెక్ట్‌కు మానస శర్మ దర్శకత్వం వహించబోతుంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌లో ఇంతకుముందే క్రియేటివ్ డైరెక్టర్‌గా రెండు సిరీస్‌లను తెరకెక్కించింది మానస.



మానస దర్శకత్వంలో వచ్చిన 'ఒక చిన్న ఫ్యామిలీ' జీ5 ప్లాట్‌ఫామ్‌లో ప్రసారమవుతుండగా.. 'బెంచ్ లైఫ్' సిరీస్ సోనీలీవ్‌లో ప్రేక్షకులను అలరిస్తుంది. ఇప్పుడు ఆమె తన మూడో ప్రాజెక్ట్‌గా ఒక ఫీచర్ ఫిల్మ్‌ను రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.